# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక : 330 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 19-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00





### ఆరురుచుల అమృతం అరవై వత్సరాల కాలచక్రం

సీసం

శుభములీయవచ్చె శుభమున్ పరాభవ
తెలుగులోగిలికిని వెలుగులీయ
వేపపూవుల చేదు వేదనల్ తీర్చగా
వడివడిగను వచ్చె వసుధపైకి
మామిడి వగరు తో మమతలు పంచుచూ
మరువబోకు మనియె మానవతను
చింతకాయ పులుపు చింతల తీర్చుచూ
శాంతి,భద్రతలును ,సహనమిచ్చు
ఉప్పు,కారము లెల్ల యుపకారములు జేయ
తీపి యే కలిగించు తేజమున్ను

మీ
విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు
రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ కవి పురస్కార గ్రహీత




## ఇరాన్‌పై అమెరికా భారీ యాక్షన్

- హార్మోజ్ కోసం బంకర్ బస్టర్ల దాడి
- హర్ముజ్ జలసంధి వద్ద భారీ సైనిక చర్య
- 5 వేల పౌండ్ల డీప్ పెనెట్రేటర్ బాంబుల ప్రయోగం
- అమెరికా తీరుపై మండిపడుతున్న ఇరాన్

వాషంగ్టన్

హోర్ముజ్ జలసంధిని మళ్లీ ప్రారంభించేందుకు అమెరికా సైన్యం భారీ సైనిక చర్యకు దిగింది. ఇరాన్ తీరప్రాంతంలో ఉన్న కఠిన రక్షణ గల మిస్సైల్ స్థావరాలపై 5 వేల పౌండ్ల డీప్ పెనెట్రే టర్ బాంబులను వరుసగా ప్రయోగించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ స్థావరాల్లో ఉన్న యాంటీ షిప్ క్రూజ్ మిస్సైళ్లు హోర్ముజ్ మార్గంలో ప్రయాణించే అంతర్జాతీయ నౌకలకు పెద్ద ముప్పుగా మా రినట్లు తెలిపింది. ఈ దాడులతో ఆ ముప్పను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. అమెరికా ఇజ్రాయెల్ యుద్ధా నికి ప్రతిగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూ సివేయడంతో ప్రపంచ చమురు సరఫరాలో సుమారు ఐదో వంతు ప్రభావితమైంది.

-మిగతా 2 లో

## ఇరాన్‌కు వరుస ఎదురు దెబ్బలు

- ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ హతం
- ప్రకటించిన ఇజ్రాయిల్ రక్షణమంత్రి



2 లో

## చేసిందీ..చేయబోయేది
# స్పష్టం చేశాం

సూచనలు ఇచ్చే ప్రయత్నం చేయని విపక్షం

- గవర్నర్ ప్రసంగం దార్శనికతకు అద్దం
- తెలంగాణ విజన్‌ను ఆవిష్కరించాం
- గవర్నర్‌ను ఆహ్వానించేందుకు కూడా రాని కేసీఆర్
- ఇంకా అహంకార ధోరణి వీడని కొందరు నేతలు
- కేసీఆర్ సభకు వచ్చి సూచనలు సలహాలు ఇవ్వాలి
- జీతాలు తీసుకుంటూ సభకు రాకుంటే ఎలా
- గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి సీఎం సమాధానం



హైదరాబాద్

గవర్నర్ ప్రసంగం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలు వివరించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఎలా ముందుకు పోవాలో..పోతున్నదో ఇందులో వివరించామని అన్నారు. తెలంగాణ విజన్‌ను ఆవిష్కరించిందన్నారు. గవర్నర్‌తో చర్చించిన తర్వాతే ప్రసంగాన్ని తయారు చేశామన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో సీఎం మాట్లాడారు. 'రాజులు పోయినా.. రాజ్యాలు పోయినా.. రాచరికపు పోకడలు పోలేదు. కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకార ధోరణి.. లేనప్పుడూ అదే ధోరణి అని ప్రతిపక్షంపై సీఎం మండిపడ్డారు.


-మిగతా 2 లో

పాఠకులకు, ప్రకటనకర్తలకు, శ్రేయోభిలాషులకు

## ఉగాది శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. కావున శుక్రవారం పత్రిక వెలువడదు

పునర్దర్శనం శనివారం




- యాజమాన్యం

## రాష్ట్రాలకు అదనంగా మరో పదిశాతం ఎల్‌పీజీ

- తాజాగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

2 లో




## "మమ్మల్ని ప్రేమించి.. మోదీని పెళ్లి చేసుకున్నారు"

- దేవెగౌడపై ఖర్గే హాస్య విసుర్లు!
- రాజ్యసభలో ఖర్గే చలోక్తులు.. నవ్వు ఆపుకోలేకపోయిన ప్రధాని మోదీ!
- డేటింగ్ మాది.. పెళ్లి మోదీతో: దేవెగౌడ రాజకీయ ప్రస్థానంపై ఖర్గే సెటైర్లు.
- రాజ్యసభ వీడ్కోలు ప్రసంగంలో ఖర్గే 'లవ్ స్టోరీ' పంచ్‌లు!




న్యూఢిల్లీ

ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే రాజ్యసభలో నవ్వులు పూయించారు. రాజ్యసభ నుంచి రిటైర్ అవుతున్న నేపథ్యంలో.. సభలో వీడ్కోలు ప్రసంగం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన సభలో జరిగిన అంశాలను ప్రస్తావించారు. తన రాజకీయ జర్నీ గురించి కొంత వివరించారు. ప్రస్తుత కాలపరిమితి ముగియడంతో.. మాజీ ప్రధాని దేవగౌడ, ఎన్సీపీ నేత శరద్ పవార్ కూడా వీడ్కోలు తీసుకుంటున్నారు.

-మిగతా 2 లో

## రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు


- రాజ్యసభ వీడ్కోలు సభలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు!
- పార్లమెంట్ ఒక 'ఓపెన్ యూనివర్సిటీ': రిటైర్ అవుతున్న ఎంపీలకు ప్రధాని సందేశం.
- ఖర్గే, దేవెగౌడ, పవార్ 'రాజకీయ మహాయోధులు': రాజ్యసభలో మోదీ ప్రశంసల జల్లు.
- సభ మారినా సేవ ఆగకూడదు
- 59 మంది సభ్యులకు ప్రధాని మోదీ ఘన వీడ్కోలు.



న్యూఢిల్లీ:

రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ప్రధాని మోదీ అన్నారు.ఆయన రాజ్యసభలో ప్రసంగించారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తన సందేశంతో ఆ సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాని మోదీ మాట్లాడుతూ

-మిగతా 2 లో



## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ వేశాం

- నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్
- 2029లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు
- ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ,

మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. దీనిలో తమ ప్రమేయం ఏమీ లేదని ఆయన చెప్పారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిబంధనల ప్రకారమే స్టేషన్ బెయిల్ ఇచ్చారు. దీనిలో మా ప్రమేయం ఏమీ లేదు. ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సిట్ వేశాం అని చెప్పారు. 2029లోనే తెలంగాణలో ఎన్నికలు జరుగుతాయని సీఎం అన్నారు. 2028లో ఎన్నికలు రావని చెప్పారు. మహిళా రిజర్వేషన్లు ముందుగా అమల్లోకి వస్తే మంచిదేనని అభిప్రాయపడ్డారు. అంతకుముందు పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు -మిగతా 2 లో



## ముఖ్యమంత్రి పదవి ఆఫర్.. అయినా సరే నో చెప్పిన విజయ్!

- ఢిల్లీ ముందు తలవంచే ప్రసక్తే లేదు: స్పష్టం చేసిన టీవీకే నేత అధవ్ అర్జున.
- మొదట 50.. ఆపై సగం సీట్లు ఇస్తామన్నా దక్కని దళపతి మద్దతు!
- ఏప్రిల్ 23న తమిళ సమరం: పెరంబూర్ నుంచి బరిలోకి విజయ్?
- ఒంటరి పోరుకే మొగ్గు: బీజేపీ, కాంగ్రెస్ ప్రతిపాదనలను తోసిపుచ్చిన టీవీకే.

న్యూఢిల్లీ:

టీవీకే అధినేత, నటుడు విజయ్‌కు తమిళనాడులో ఒక జాతీయ పార్టీ సీఎం పదవి ఆఫర్ చేసిందని టీవీకే నేత అధవ్ అర్జున అన్నారు. అయితే, అది ఏ పార్టీయో వెల్లడించలేదు. ఆయన వ్యాఖ్యల్ని బట్టి, అది జాతీయ పార్టీ అని స్పష్టమవుతోంది. అయితే, ఈ ఆఫర్‌ను విజయ్ తిరస్కరించినట్లు అర్జున తెలిపారు. తమిళనాడు ఎన్నికల్లో టీవీకే పార్టీ ప్రభావాన్ని కాదనలేం. ఆ పార్టీ అధినేత, నటుడు విజయ్‌కు ఉన్న ఫాలోయింగ్ తప్పకుండా ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుంది. ఆయన పార్టీ అధికారంలోకి వస్తుందా.. రాదా అంటే ఇప్పుడే చెప్పలేం. కానీ, ఓటర్లను ప్రభావితం చేయగలదు.అందుకే విజయ్‌ను తమ వైపు తిప్పుకొనేందుకు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయన్నది ఒక ప్రచారం. ఇటీవల పలు సందర్భాల్లో కాంగ్రెస్ నేతలు విజయ్ పట్ల సానుకూలంగా మాట్లాడారు. ఇదే సమయంలో బీజేపీ నేతలు కూడా విజయ్‌ను తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నించారని ప్రచారం మొదలైంది. మొదట ఆయనకు డిప్యూటీ సీఎం పదవిని బీజేపీ ఆఫర్ చేసిందని ప్రచారం జరిగింది. ఇదే అంశంపై టీవీకే నేత ఆదవ్ అర్జున మాట్లాడారు. ఒక జాతీయ పార్టీ విజయ్‌కు సీఎం పదవి ఆఫర్ చేసిందని వెల్లడించారు. అంతేకాదు.. మొదట 50 సీట్ల నుంచి మొదలై 90 సీట్లు, ఆపై సగం సీట్ల వరకు ఇచ్చేందుక సిద్ధమైనట్లు తెలిపారు. అయితే, సీఎం పదవి కోసం విజయ్ ఢిల్లీ ముందు తలవంచబోరని చెప్పారు. ఈ ఆఫర్‌ను విజయ్

-మిగతా 2 లో

## మూసీ ప్రక్షాళనపై స్పష్టత లేని ప్రభుత్వం

మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ



- డిపిఆర్ లేదు..ప్రణాళిక లేకుండా ఎలా
- పేదల ఇళ్లు కూల్చివేత దారుణం
- బఫర్ జోన్ నిర్ణయంలోను అస్పష్టత
- అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై నిలదీసిన కేటీఆర్
- ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ వాకౌట్

హైదరాబాద్

మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన దాటవేసే ధోరణిలో

-మిగతా 2 లో

# ఇరాన్‌పై అమెరికా భారీ యాక్షన్

మొదటి తరువాయి

అనేక దేశాలకు చెందిన చమురు నౌకలు అక్కడే నిలి చిపోవడంతో సముద్ర రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ పరిణామాల మధ్య హార్ముజ్ భద్రత కోసం సహకరించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్ర దేశాలను కోరినా పెద్దగా స్పందన రాలేదు. నాటో దేశాలు కూడా సైనిక సహాయం విషయంలో వెనుకంజ వేశాయి. 'మేము ఎంతోసహాయం చేసినప్పటికీ మాకు మద్దతు రావడం లేదు' అంటూ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఈ దాడికి దిగినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. అణు ఆయుధాల అభివృద్ధి దిశగా తాము సాగుతున్నామన్న అమెరికా ఆరోపణల ను ఇరాన్ ఖండించింది. తమ అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకే పరిమితమ ని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ నెలలుగా ఒత్తిడి తీసుకువస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ యుద్ధని ర్ణయాన్ని ముందుకు నెట్టినట్లు అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి. బంకర్ బస్టర్ గా పిలిచే ఈ డీప్ పెనెట్రేటర్ బాంబులు భూమిలో లోతుగా దాగి ఉన్న లేదా బలమైన కాంక్రీట్ నిర్మాణాల్లో ఉన్న లక్ష్యాలను ఛేదించి పేలేలా రూపొందించారు. ఒక్కో బాంబు ధర లక్షల డాలర్ల వరకు ఉంటుందని అంచనా. గతంలో అమెరికా మరింత భారీ 30 వేల పౌండ్ల బాంబులను కూడా వినియోగించినప్పటికీ, ప్రస్తుత దాడిలో ఉపయోగించినవి. కీలక లక్ష్యాలను కచ్చితంగా ధ్వంసం చేసే విధంగా ప్రయోగించినట్లు సమాచారం.

# ఇరాన్‌కు వరుసఎదురు దెబ్బలు

**-ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ హతం**

**-ప్రకటించిన ఇజ్రాయిల్ రక్షణమంత్రి**

**టెహ్రాన్,**



సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనే మరణం తర్వాత ఇరాన్‌కు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. టెహ్రాన్‌పై రాత్రికి రాత్రి జరిపిన దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ మృతి చెందినట్టు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ బుధవారంనాడు ప్రకటించారు. ఇరాన్ సీనియర్ అధికారులు ఎవరినైనా సరే ఎలాంటి అదనపు అనుమతులు అవసరం లేకుండా మట్టుబెట్టాలని మిలిటరీకి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు స్వేచ్ఛనిచ్చినట్టు ఆయన తెలిపారు. అయితే ఇస్మయిల్ ఖతీబ్ మృతి వార్తలను ఇరాన్ ఇంకా ధ్రువీకరించలేదు. కాగా, ఇస్మయిల్ ఖతీబ్ మృతికి ఒక రోజు ముందే ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ సైతం ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు. ఆయనతో పాటు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కోర్(ఐఆర్‌జీసీ) పారామిలిటరీ దళం 'బసిజ్ ఫోర్స్' కమాండర్ గోలం రెజా సోలేమానీ, పెద్ద సంఖ్యలో మిలిటరీ ఉన్నతాధికారులు తమ దాడుల్లో మృతిచెందినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. జ్రాయెల్ దాడులకు ప్రతిగా ఆదేశంలోని 100 టార్గెట్లను లక్ష్యంగా చేసుకున్నట్టు ఇరాన్ తెలిపింది. ఉద్రిక్తతలను తగ్గించే ప్రతిపాదనను ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తోసిపుచ్చారు. శాంతికి ఇది సమయం కాదని, ఓటమిని అంగీకరించి నష్టపరిహారం ఇచ్చేంతవరకూ అమెరికా, ఇజ్రాయెల్‌తో శాంతి కుదరదని చెప్పారు.

## "మమ్మల్ని ప్రేమించి..మోదీని పెళ్లి చేసుకున్నారు"

మొదటి తరువాయి

అయితే ఖర్గే తన ప్రసంగంలో దేవగౌడతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. దేవగౌడ గతంలో దేశ ప్రధానిగా చేశారని, ఎన్నో కీలక పదవుల్లో బాధ్యతలు నిర్వర్తించారని, ఆయన గత 54 ఏళ్లుగా తనకు పరిచయం ఉందని, ఆయనతో కలిసి పనిచేసినట్లు ఖర్గే తెలిపారు. అయితే ఏం జరిగిందో ఏం తెలియదు కానీ, తమతో డేటింగ్ చేసి, తమను ప్రేమించిన అతను.. ప్రధాని మోదీని పెళ్లి చేసుకున్నారని అన్నారు. దీంతో సభలోని సభ్యులందరూ నవ్వేశారు. అక్కడే ఉన్న ప్రధాని మోదీ కూడా నవ్వు ఆపుకోలేకపోయారు .996 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఓ ఏడాది కాలం పాటు ప్రధానిగా దేవగౌడ చేశారు. యూనైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు ఇచ్చింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో జేడీఎస్, కాంగ్రెస్ కలిసి పోటీ చేశాయి. ఆ ఫైట్‌లో ఆ కూటమి గెలిచింది. హెచ్‌డీ కుమారస్వామి సీఎం అయ్యారు. కానీ 2019లో ఆ ప్రభుత్వం కూలింది. ఆ తర్వాత బీజేపీతో జేడీఎస్ జతకట్టిన విషయం తెలిసిందే. ఖర్గే తన ప్రసంగంలో మాట్లాడుతూ.. శరద్ పవార్, తిరుచ్చి శివతోనూ తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు చెప్పారు. అయితే ఆ ఇద్దరీ మళ్లీ రాజ్యసభలోకి ఎంటర్‌కానున్నారు. కేంద్ర మంత్రి అత్వాలే గురించి ప్రస్తావిస్తూ.. ఆయన తన పద్యంలోని ప్రధాని మోదీని మెచ్చుకుంటారని, ఇక ఆయనకు మరో పద్యం రాదు అని అన్నారు. దీంతో సభ్యులు నవ్వుకున్నారు.

## రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదు

మొదటి తరువాయి

పార్లమెంట్ ఓ ఓపెన్ యూనివర్సిటీ లాంటిదన్నారు. రిటైర్ అయి వెళ్లిపోతున్న ఎంపీలు.. దేశం కోసం తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ లాంటి సందర్భాల్లో పార్టీల మధ్య ఉన్న విబేధాలు సమసిపోతాయన్నారు. మనలో ఒకేరకమైన భావోద్వేగం వస్తుందని, మనతో ఇన్నాళ్లు పనిచేసిన తోటి సభ్యులు తమ జీవితంలో మరో మార్గాన్ని అన్వేషించబోతున్నారని గ్రహిస్తామని ప్రధాని పేర్కొన్నారు. అయితే మళ్లీ రాజ్యసభకు రాలేని వారిని ఉద్దేశిస్తూ.. రాజకీయాల్లో ఫుల్ స్టాప్ అంటూ ఉండదని, మీ కోసం భవిష్యత్తు ఎదురుచూస్తోందని, ఈ దేశ నిర్మాణం కోసం మీ అనుభవాలు చాలా అవసరం ఉంటుందని ప్రధాని తెలిపారు.రాజ్యసభలో సీనియర్ సభ్యులుగా ఉన్న మాజీ ప్రధాని దేవగౌడ, ప్రతిపక్ష నేత మల్లిఖార్జున్ ఖర్గే, ఎన్సీపీ నేత శరద్ పవార్‌పై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. ఆ ముగ్గురూ రాజకీయాల్లో మహాయోధులన్నారు. పార్లమెంట్ కోసం వారి సగం కన్నా ఎక్కువ జీవితాన్ని అంకితం చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. వారు సభలకు హాజరువుతున్న తీరు, వారిలో అంకితభావం అసాధారణమైందన్నారు. కొత్తగా ఎంపికైన ఎంపీలు వారి నుంచి స్ఫూర్తి పొందాలని ప్రధాని ఆశించారు. డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన చాలా మృదుస్వభావి అని అన్నారు. కానీ నిత్యం కార్యాచరణలో నిమగ్నమై ఉంటాడన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే గురించి మాట్లాడుతూ ఆయన నిజంగా ఎవర్‌గ్రీన్ అన్నారు. సభ బయట కూడా ఆయన వ్యంగాన్ని , హాస్యాన్ని ప్రదర్శించాలని ఆశించారు.పార్లమెంట్ ప్రక్రియలో ఉన్న ఉభయసభల విధానం గురించి ప్రధాని మోదీ ప్రస్తావిస్తూ.. ఓ చట్టానికి ఆమోదం దక్కాలంటే రెండో అభిప్రాయం అవసరంమని, అలాంటి విధానం వల్ల ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి పదవి ఆఫర్.. అయినా సరే నో చెప్పిన విజయ్!

మొదటి తరువాయి

తిరస్కరించారని అర్జున అన్నారు.అది ఏ పార్టీయో చెప్పకపోయినప్పటికీ బీజేపీయే అని కొందరు టీవీకే నేతలు అంటున్నారు. ఇటీవల విజయ్ కూడా ఈ ఎన్నికల వరకు తమ పార్టీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేశారు. వచ్చే నెలలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామన్నారు. విజయ్ పార్టీతో తమ పార్టీ చర్చలు జరపడం లేదని ఏఐఏడీఎంకే కూడా ఇటీవల స్పష్టం చేసింది. బీజేపీ మాత్రం అధికార డీఎంకేను ఓడించాలంటే పొత్తు అవసరం అని భావిస్తోంది. ఈ ఎన్నికల్లో మాత్రం విజయ్ పార్టీ టీవీకే ఒంటరిగానే పోటీ చేసే అవకాశాలున్నాయి. విజయ్ తన పార్టీ అభ్యర్థుల జాబితాను ఒకట్రెండు రోజుల్లో విడుదల చేసే అవకాశాలున్నాయి. విజయ్ పెరంబూర్ నుంచి పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. పార్టీకి చెందిన మరో కీలక నేత ఎన్ ఆనంద్ టీ నగర్ నుంచి, జనరల్ సెక్రెటరీ అధవ్ అర్జున విల్లివక్కం నుంచి పోటీ చేస్తారు. 234 సీట్లున్న తమిళనాడు అసెంబ్లీకి ఏప్రిల్ 23న ఎన్నిక జరగనుంది. మే 4న ఫలితాలుంటాయి.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ వేశాం

మొదటి తరువాయి

రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలను రేవంత్‌రెడ్డి కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి వెళ్లి వారితో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని రాహుల్, ప్రియాంకలకు రేవంత్ పరిచయం చేశారు. పార్లమెంట్‌లో వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా సీఎం రేవంత్ రెడ్డి, ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా వారిరువురు ఒకరినొకరు పలకరించుకున్నారు.

# చేసిందీ..చేయబోయేది స్పష్టం చేశాం

మొదటి తరువాయి

ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులని పేర్కొన్నారు.కొత్త గవర్నర్‌ను కలిసేందుకు ప్రతిపక్ష నేత వస్తారనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతుందనుకున్నాం. గవర్నర్ ప్రసంగంపై సూచనలు, సలహాలు వస్తాయనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం నుంచి కనీస స్పందన రాలేదు. కేసీఆర్ సభకు రావాలని కోరుకుంటున్నాం. ఆయన సభలో పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలని అన్నారు. ఇదే సందర్భంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. రాష్ట్రానికి కొత్త గవర్నర్ వచ్చిన కనీసం శుభాకాంక్షలు తెలిపేందుకైన ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న కేసీఆర్ సభ రాడా.. సభకు రావాల్సిన బాధ్యత లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని.. బీఆర్ఎస్‌ను ఓడించి ప్రజలే తప్పు చేసినట్లుగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారం పోయినా ఇంకా అదే అహంకారంతో ఉన్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ ఇప్పటికైనా సభకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఆయనకు ఉన్న అనుభవంతో ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేస్తే స్వీకరిస్తామని తెలిపారు. 4 కోట్ల ప్రజలను నిరాశ పర్చేలా ప్రతిపక్షాల తీరు ఉందని తమ ప్రభుత్వం భవిష్యత్ ప్రణాళికలతో ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగం చారిత్రాత్మకం. గవర్నర్ ప్రసంగం తెలంగాణ అభివృద్ధికి విశిష్ట ప్రణాళిక. ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి హుందాగా ధన్యవాదాలు తెలుపుతుందని ఆశించాం. అభివృద్ధిలో కలిసి వస్తారని ఆశించాం.. కానీ అహంకారం ప్రదర్శించారు. 4 కోట్ల మంది ప్రజలను నిరాశ పర్చేలా ప్రతీపక్షాల తీరు ఉందన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభను పక్క దారి పట్టించారు. ప్రతిపక్షంలో కూర్చొబెట్టిన వాళ్ల తీరు మారలేదు. సభ సంప్రదాయాలను విపక్ష నేత గౌరవించకపోవడం రాష్ట్రానికి మాయని మచ్చ. ప్రతిపక్ష నాయకుడు ఇప్పటిదాకా కోటీ 6 లక్షలకు పైగా జీతభత్యాలు పొందారు. కేసీఆర్ ఇప్పటికైనా సభకు రావాలని అన్నారు. ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటయ్యేందుకు మాజీ ప్రధాని పీవీ విధానాలే కారణం. పీవీ నరసింహారావు, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తొలిసారి హైటెక్ సిటీకి పునాది రాయి వేశారు. అనంతరం చంద్రబాబు, వాజ్‌పేయీ హైటెక్ సిటీని పూర్తి చేశారు. ప్రస్తుతం ఏఐ ద్వారా లక్షలాది ఉద్యోగాలు పోయి



నిరుద్యోగ సమస్య తలెత్తే పరిస్థితి. ఈ పరిస్థితుల్లో మనం భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉంది. సవాళ్లను ఎదుర్కోవడంపై విజన్ డాక్యుమెంట్‌ను సభలో ప్రవేశపెట్టాం' అని సీఎం అన్నారు. గవర్నర్ ప్రసంగం కేవలం ప్రభుత్వ కార్యక్రమాల జాబితా కాకుండా, భవిష్యత్తు తెలంగాణకు ఒక విజన్ డాక్యుమెంట్‌గా నిలిచిందని పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగం తెలంగాణ ప్రజల ఆశయాలను ప్రతిబింబించిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రభుత్వ సంకల్పాన్ని చూపించిందని చెప్పుకొచ్చారు. భవిష్యత్ ఆర్థిక ప్రణాళికలకు బలమైన పునాది వేసిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న సంకల్పాన్ని, గొప్ప విజన్‌ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం చరిత్రాత్మకమని ఉద్ఘాటించారు. గవర్నర్ చేసిన ప్రసంగం కేవలం అక్షరాల రూపంలో ఉన్న ఆలోచనలు కాదని.. తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శి అని వ్యాఖ్యానించారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రం ఎదగడానికి అవసరమైన విశిష్ఠ ప్రణాళిక అని తెలిపారు. అలాంటి గొప్ప సంకల్పాన్ని, పవిత్ర శాసన సభ వేదిక నుంచి రాష్ట్ర ప్రజల ముందు ఉంచిన గవర్నర్ శుక్లాకి ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకున్న సందర్భంగా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ వస్తారని అనుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్త గవర్నర్‌కు కేసీఆర్ శుభాకాంక్షలు చెబుతారని భావించామని.. కానీ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సభకు రాలేదని ప్రశ్నించారు. ప్రజలు బుద్ధిచెప్పి ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా ఇప్పుడూ అదే తీరుగా బీఆర్ఎస్ నేతలు ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. డిసెంబర్ 1, 2023 నుంచి ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రూ.1.6కోట్లకు పైగా జీతభత్యాలు పొందారని ప్రస్తావించారు. అసెంబ్లీలో కేసీఆర్ తన విధులకు హాజరు కాకుండా జీతభత్యాలు తీసుకోవడంపై ఒక నిర్ణయం తీసుకోవాలని అన్నారు.ఇప్పటికైనా కేసీఆర్ సభకు రావాలని, వస్తారని ఆశిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గత చరిత్రను అనుభవాలుగా మార్చుకుంటూ భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాలని గవర్నర్ ప్రసంగంలో వివరించారని అన్నారు. సంక్షోభ సమయంలో దేశ ప్రధానిగా జవహర్ లాల్ నెహ్రూ బాధ్యతలు చేపట్టారని గుర్తుచేశారు. నెహ్రూ తీసుకున్న ప్రణాళికలతోనే ఇవాళ దేశం ఈ పరిస్థితుల్లో ఉందని తెలిపారు. మొదటి తరంలో నెహ్రూ- ఇందిరాగాంధీ గొప్ప విధానాలు తీసుకువచ్చారని ఉద్ఘాటించారు. సరళీకృత విధానాలతో దేశ ఆర్థిక గతిని మార్చిన ఘనత పీవీ నరసింహారావుదని తెలిపారు. 1990 నుంచి 2020 వరకు 30 ఏళ్లు పీవీ నరసింహారావు నుంచి మన్మోహన్ సింగ్ వరకు అనేక సంస్కరణలు తీసుకొచ్చారని ప్రస్తావించారు. భవిష్యత్తులో ఏఐ సునామీ రాబోతుందని చెప్పుకొచ్చారు. దీనిని ఎదుర్కొనేందుకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించిన ఒక పాలసీ డాక్యుమెంట్‌ను గవర్నర్ తన ప్రసంగంలో వివరించారని అన్నారు. ప్రతిపక్ష నాయకులు తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను కనీసం చదివారా..? చూశారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మనం భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించకపోతే తర్వాత తరాలు మనల్ని క్షమించవని హితవు పలికారు. ఇది నవశకానికి నాంది పలుకాల్సిన సమయమని నొక్కిచెప్పారు.

అధికారం కోల్పోయామనే దు:ఖమే తప్ప ప్రభుత్వానికి సహకరించాలనే ఆలోచన ప్రధాన ప్రతిపక్షానికి లేదుని ఆగ్రహించారు. అందుకే ఎవరు అడ్డుపడ్డా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. అన్ని రంగాల మేధావులతో సమన్వయం చేసుకుని తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించుకున్నామని వివరించారు. తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# రాష్ట్రాలకు అదనంగా మరో పదిశాతం ఎల్‌పీజీ

**తాజాగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం**

న్యూఢిల్లీ,

: ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా దేశంలో తలెత్తిన ఎల్‌పీజీ కొరతను అధిగమించేందుకు కేంద్రం మరో కీలక ప్రకటన చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అదనంగా మరో 10 శాతం కమర్షియల్ ఎల్‌పీజీ అందించేందుకు అంగీకరించింది. అయితే ఎల్‌పీజీ భారాన్ని తగ్గించి పైప్డ్ నేచురల్ గ్యాస్ వాడకాన్ని పెంచే రాష్ట్రాలకు మాత్రమే ఈ అదనపు సరఫరా వర్తిస్తుందని తెలిపింది. ఆ ప్రకారం ఎల్పీజీ నుంచి పీఎన్‌జీకి మారేలా రాష్ట్రాలు ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం చేయాల్సి ఉంటుంది.




దేశీయ వంటగ్యాస్ సరఫరాకు ఆటకం కలగకుండా చూడటం, వాణిజ్య అవసరాల కోసం గ్యాస్ కొరత తీర్చడం ప్రభుత్వ ముఖ్యోద్దేశమని పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. సీజీడీ అప్లికేషన్ల అప్రూవల్, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లయితే 1 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని, డీమ్డ్ సీజీడీ పర్మిషన్లు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేస్తే 2 శాతం, రోడ్ల తవ్వకం, మరమ్మతు పథకం ప్రవేశపెడితే 3 శాతం, వార్షిక రెంటల్/లీజ్ తగ్గిస్తే 4 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని ఆమె చెప్పారు. ఎల్‌పీజీ అంశం ఇంకా ఆందోళనకరంగానే ఉన్నప్పటికే ఆన్‌లైన్ బుకింగ్ పరిస్థితి మెరుగుపడిందని సుజాత శర్మ తెలిపారు. ఈనెల 17న 2,300కు పైగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. చాలా రాష్ట్రాలు ఇప్పటికే స్టేట్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కాగా, ఎల్పీజీ సరఫరాలపై ఒత్తిడిని తగ్గించేందుకు హాస్పిటాలిటీ, రెస్టారెంట్లతో సహా పలు రంగాలకు కిరోసిన్, బొగ్గు సరఫరాలకు కేంద్రం ఇప్పటికే ఆదేశాలిచ్చింది.

# మూసీ ప్రక్షాళనపై స్పష్టత లేని ప్రభుత్వం

మొదటి తరువాయి

సమాధానం ఇవ్వడంపై కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు.. ప్రణాళికలు లేవని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు.. లక్షన్నర కోట్ల దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. మూసీ ప్రాజెక్టు కోసం రుణం మంజూరైందని గతంలో మంత్రి చెప్పారని తెలిపారు. డీపీఆర్ కూడా సబ్‌మిట్ చేయలేదని అప్పుడు ఏడీబీ చెప్పిందని పేర్కొన్నారు. రుణం మంజూరు కాలేదని ఈ నెల 11వ తేదీన ఏడీబీ లేఖ ఇచ్చిందన్నారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంలో ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. 18 నెలలు పడుతుందన్న డీపీఆర్ రెండు నెలల్లో ఎలా వచ్చిందని ప్రశ్నించారు.మూసీ ప్రాజెక్టు మొదటి ఫేజ్ తర్వాత ఎన్ని ఫేజులు ఉంటాయని కేటీఆర్ అడిగారు. మూసీ ప్రాజెక్టుకు ఎన్ని ఫేజులు ఉన్నాయని ప్రశ్నించారు. రూ.16వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు లక్షన్నర కోట్లు ఎందుకు అని నిలదీశారు. మూసీ ప్రాజెక్టులో బఫర్ జోన్ ఎంత అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుతో వేలాది మంది నష్టపోతున్నారని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతో రేవంత్ సర్కార్ గృహ మేధ యాగం చేస్తోందని మండిపడ్డారు. బ్లాక్ లిస్ట్ చేసిన కంపెనీలకు కాంట్రాక్టు ఎందుకిస్తున్నారని ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండా హడావిడిగా ఇళ్లు ఎందుకు కూలుస్తున్నారని అడిగారు. కేటీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన ప్రభుత్వం.. దాటవేసే ధోరణిలో వ్యవహరించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీపై రేవంత్ సర్కార్ తీరుకు నిరసన తెలిపారు. ముఖ్యంగా డీపీఆర్ తయారీ, ఇళ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు, అలాగే ప్రభుత్వం చేస్తున్న విభిన్న ప్రకటనలలో ఉన్న విరుద్ధతలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి కలిసి మూసీ ప్రాజెక్టుపై అనేక సందేహాలను వ్యక్తం చేశారు. మొత్తం 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఒకవైపు లక్షన్నర కోట్లు అంటుండగా, సభలో మాత్రం నాలుగు, ఐదు వేల కోట్లు అని చెప్పడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు, ఎంత భూసేకరణ జరుగుతుంది, ఎన్ని ఇళ్లు కూల్చివేస్తారు అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం 10,000 పైగా ఇళ్లు కూల్చివేతకు గురవుతాయని, 3,260 ఎకరాల భూమి సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. బఫర్ జోన్‌ను విస్తరించామని స్థానిక ఆర్డీవో చెబుతున్నారని, అసలు బఫర్ జోన్ ఎంత వరకు పెంచారో, దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, పారదర్శకత లేకుండా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వంవద్ద డీపీఆర్ ఉందా లేదా అన్న విషయానికే స్పష్టమైన సమాధానం లేదని విమర్శించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సైతం డీపీఆర్ లేదని చెబుతున్నారని తెలిపారు. ఎన్ని ఇళ్లు కూల్చివేస్తున్నారు అనే విషయానికీ ప్రభుత్వం సరైన వివరాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ÷వ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్లు చేయకుండా, బాధితులతో ప్రజల మధ్యే ప్రజెంటేషన్ ఇవ్వాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కారణంగానే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు బీఆర్ఎస్ హాజరుకాలేదని స్పష్టం చేశారు. మూసీ నదిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పుడు అదే పార్టీ ప్రజల పేరుతో భారీ ప్రాజెక్ట్ పేరుతో అవినీతి చేయాలని చూస్తోందని అన్నారు. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉంటే వెంటనే సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమాన్ నగర్‌కు నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ అస్పష్టతకు నిదర్శనమని విమర్శించారు. మొదట 1,400 ఇళ్లు కూల్చివేస్తామని చెప్పి, ప్రస్తుతం 10,000 ఇళ్లకు పైగా నోటీసులు ఇవ్వడం ఎలా జరిగిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో సొంత జిల్లాలోనే ఇళ్లు కూల్చివేస్తున్నా ఉప ముఖ్యమంత్రికి కనీస సమాచారం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, సరైన ప్రణాళిక లేదని, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ లోన్ కూడా లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్ట్ డీపీఆర్ తయారీని 'మెయిన్ హార్ట్' అనే కంపెనీకి అప్పగించారని, ఈ కంపెనీని సింగపూర్, పాకిస్తాన్, భారతదేశంలోని అనేక సంస్థలు బ్యాన్ చేశాయని తెలిపారు. గతంలో ఇదే అసెంబ్లీలో డీపీఆర్ తయారీకి కనీసం 18 నెలలు పడుతుందని చెప్పి, ఇప్పుడు కేవలం రెండు నెలల్లో డీపీఆర్ సిద్ధమైందని చెబుతుండటం అనుమానాస్పదమని అన్నారు. రెండు నెలల్లో అద్భుతంగా డీపీఆర్ తయారు చేసి ఉంటే, దాన్ని ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణం ఇవ్వడానికి అంగీకరించిందని మంత్రి శ్రీధర్ బాబు సభలో చెప్పారని, కానీ బ్యాంక్ అధికారులను సంప్రదించగా జనవరి 23 నాటికి ఎలాంటి డీపీఆర్ తమకు అందలేదని, కాబట్టి రుణంపై ఎలాంటి అంగీకారం లేదని స్పష్టం చేశారని తెలిపారు. మార్చి 11న కూడా అదే విషయాన్ని ఏడీబీ మరోసారి స్పష్టం చేసిందని అన్నారు. ప్రభుత్వం తన సమాచారాన్ని సరిదిద్దుకోవాలి లేదా కావాలనే ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నదా అనే అనుమానం కలుగుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# బెల్టు షాపులపై ఆందోళన

**పెద్దపల్లి, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాల్వ శ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల్లో బెల్టు షాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయని సామాజిక ఉద్యమకారుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్, దీఎా పార్టీ సీనియర్ నాయకుడు అకుల స్వామి వివేక్ పటేల్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా ఫిర్యాదు చేశారు. కిరాణా షాపుల్లో పగలు--రాత్రి తేడా లేకుండా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, యువత మద్యానికి బానిసై చదువులకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు విషయం తెలిసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు.కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి, కాల్వ



శ్రీరాంపూర్ గ్రామాల్లో మూడు మద్యం షాపులు నడుస్తున్నాయని, వీటి యజమానులు బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తూ అధిక ధరలకు గ్రామస్తులకు విక్రయిస్తున్నారని తెలిపారు. దీంతో యువత మద్యం మత్తులో దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్నారని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాల మైదానాల్లో కూడా రాత్రివేళ మద్యం సేవించి ఖాళీ బాటిళ్లు పారేస్తున్నారని, తక్షణమే కలెక్టర్ స్పందించి కాల్వ శ్రీరాంపూర్ మండలం 23 గ్రామాల్లో, పెద్దపల్లి మండలం 30 గ్రామాల్లో బెల్టు షాపులను మూసివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# గాయత్రి విద్యానికేతన్‌లో ముందస్తు ఉగాది సంబరాలు



**పెద్దపల్లి,మార్చి 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో ముందస్తు ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులకు ఉగాది పండుగ యొక్క ప్రాముఖ్యత, విశిష్టతను వివరించారు. ఉగాది అనగా నూతన సంవత్సర ఆరంభం. ప్రకృతి, కాలచక్రంలో మార్పులను అనుసరించి ఈ పండుగ జరుపుకుంటాం అని చెప్పారు.ఉగాది పచ్చడి ప్రాముఖ్యతను వివరించి, దానిలోని పదార్థాలు జీవితం లోని ఆనందం, దుఃఖం, కోపం, ఆశ్చర్యం వంటి అనుభవాలకు ప్రతీకలని తెలియజేశారు. అనంతరం విద్యార్థుల చేతనే ఉగాది పచ్చడిని తయారు చేయించి అందరికీ పంపిణీ చేశారు.కార్యక్రమంలో చిన్నారులు ఉగాది పాటలు, భక్తి గీతాలపై నృత్య ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను అలరించారు. చిన్నారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యానికేతన్ చైర్మన్ శ్రీనివాస్, కరస్పాండెంట్ రజిని, అధ్యాపక బృందం పాల్గొన్నారు. ఉత్సాహభరిత వాతావరణంలో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# ఆరుట్లలో మెగా హెల్త్ క్యాంపు



**మహేశ్వరం, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ఆరుట్ల గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మి ప్రసన్న, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పల్లవి, గ్రామ సర్పంచ్ శోభ కుమార్ రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు.ఈ క్యాంపులో నేత్ర, పిల్లల, ప్రసూతి--గైనకాలజీ, ఆర్థోపెడిక్, దంత, జనరల్ మెడిసిన్ వంటి విభాగాల వైద్యులు సేవలు అందించారు. మొత్తం 473 మంది రోగులు పరీక్షలు చేయించుకుని ఉచిత మందులు పొందారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ నూకం రాజు ముదిరాజ్, గ్రామ కార్యదర్శి వెంకటేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, నర్సులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశ్వకర్మ యోజన కిట్లు పంపిణీ



**హుస్నాబాద్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అక్కన్నపేట మండల కేంద్రంలో విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా లబ్ధిదారులకు విశ్వకర్మ కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి పథకం ద్వారా లబ్ధి పొందిన అక్కన్నపేటకు చెందిన కందుకూరి అరుణాచారికి కిట్టు అందజేయడం జరిగిందని తెలిపారు. అరుణాచారి మాట్లాడుతూ, మోదీ గారి విశ్వకర్మ యోజన పథకంలో అప్లై చేసి, సిద్దిపేటలో క్లాసులు అటెండ్ అయ్యాం. కేంద్ర ప్రభుత్వం చేతివృత్తులకు చేయూతనిస్తూ, కులవృత్తులను ప్రోత్సహిస్తూ ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ కిట్టు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది అని అన్నారుకార్యక్రమంలో జనగామ కో కన్వీనర్ వేణుగోపాలరావు, మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్, మడక రవికుమార్, మహిళా మోర్చా మాజీ ఉపాధ్యక్షురాలు మేడమైన సరూప, ఎస్టీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు మోహన్ నాయక్, సంజీవరెడ్డి, జగదీశ్వర చారి, పల్లె ప్రభాకర్ రెడ్డి, నేరెళ్ల రమేష్, బొంకురి రజినీకాంత్, గంపల మధు, మిట్టపల్లి సత్యనారాయణ, రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ ఫలితాల్లో 10వ ర్యాంకు సాధించిన గన్నబోయిన శ్రీ వాత్సవ



**పెద్దపల్లి, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నవోదయ విద్యాలయ సమితి 2026 విద్యా సంవత్సరానికి గాను నిర్వహించిన ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో జిల్లా స్థాయిలో హనుమంతునిపేటకు చెందిన విద్యార్థి గన్నబోయిన శ్రీ వాత్సవ 10వ ర్యాంకు సాధించి ప్రతిభను చాటాడు.అత్యుత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థిని చైతన్య విశ్వభారతి హై స్కూల్ కరస్పాండెంట్ తిరుపహరి లక్ష్మణస్వామి, ప్రిన్సిపల్ జ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# ఆధార్ సెంటర్ పునరుద్ధరణకు ప్రజల డిమాండ్

AADHAAR

**ఉప్పల్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గత కొద్ది నెలలుగా సేవలు అందించిన ఆధార్ కేంద్రాన్ని తొలగించడంతో స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొత్త ఆధార్ కార్డు నమోదు, సవరణ, వివరాల అప్డేట్ కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.ఉప్పల్ కేంద్రంగా ఆధార్ సౌకర్యం మళ్లీ ఏర్పాటు చేస్తే, పక్కనే ఉన్న చిల్కనగర్, పీర్జాదిగూడ, బోడుప్పల్ పట్టణ ప్రజలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ప్రజల సౌకర్యార్థం ఆధార్ కేంద్రాన్ని తక్షణమే పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# బొమ్మ వెంకన్న సేవలు మరువరానివి

**- చల్ల హరిశంకర్**

**కరీంనగర్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** మున్నూరు కాపు ముద్దుబిడ్డ, మాజీ శాసనసభ సభ్యుడు స్వర్గీయ బొమ్మ వెంకటేశ్వర్ 7వ వర్ధంతి సందర్భంగా బుధవారం కరీంనగర్ బొమ్మకల్‌లోని మున్నూరు కాపు వసతి గృహంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ మాట్లాడుతూ, మున్నూరు కాపులను ఒక తాటిపైకి తీసుకువచ్చిన ఘనత బొమ్మ వెంకన్నది. ఆయన



సేవలు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో మున్నూరు కాపుల అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచాయి. పేదల పెన్నిధిగా ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడిన మహానాయకుడు అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్తో పాటు కుల బాంధవులు పాల్గొన్నారు

# కానుక కాదు.. బాధ్యత

**-- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్‌నగర్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "రంజాన్ తోఫా అనేది కానుక మాత్రమే కాదు, అన్ని మతాలను సమానంగా గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది" అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ముస్లిం సోదరులకు ఆయన స్వయంగా రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు.నియోజకవర్గానికి 1000, మున్సిపాలిటీకి 250 తోఫాలు కేటాయించామని, పండుగలోపు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఫరూఖ్‌నగర్ ఈద్గా వద్ద ప్రార్థనలకు వచ్చే భక్తులకు అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సమాజానికి ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, నాయకులు వావిలాల సుజీవన్, ఇమ్రూద్ ఖాన్, ఎండి ఇబ్రహీం, ముబారక్ అలీ ఖాన్, కౌన్సిలర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

**కరీంనగర్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాత బజార్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా ఆర్థికంగా వెనుకబడిన 50 ఆర్యవైశ్య కుటుంబాలకు ఉగాది కానుక సామాగ్రి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నలుమాచు విజయ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్, అదన ప్రధాన కార్యదర్శి సురేష్, కోశాధికారి సురేష్తో పాటు సభ్యులు తొడుపునూరు రాకేష్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, పోకల శ్రీనివాస్, సురేందర్, చంద్రశేఖర్, ఆంజనేయులు, మారుతి, మోహన్, పురుషోత్తం, రంజిత్, మనీ, దీక్షిత్, విశ్వనాథం, శ్రీధర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# ‘పరాభవ’ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

## -- నీల రవీందర్



**షాద్‌నగర్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలుగు నూతన సంవత్సరం ‘పరాభవ’ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలందరికీ ప్రముఖ సామాజిక కార్యకర్త నీల రవీందర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “ఉగాది అనేది సృష్టి ఆరంభాన్ని సూచించే పవిత్ర దినం. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు జీవన సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించాలని మనకు బోధిస్తాయి. వసంతకాలం కొత్త చిగుళ్లతో ప్రకృతిని అలంకరించినట్లే, మన ఆలోచనలు కూడా సమాజ హితం కోరేలా కొత్త పుంతలు తొక్కాలి” అని పేర్కొన్నారు. ఈ ‘పరాభవ’ నామ సంవత్సరంలో ప్రతి ఇల్లూ సుఖశాంతులతో వర్ధిల్లాలని, రైతన్నలకు సాగు కలిసిరావాలని, విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించాలని కోరుకుంటున్నాను” అని నీల రవీందర్ ఆకాంక్షించారు.

# నవోదయ పాఠశాలలో సీటు సాధించిన సమన్వికి సత్కారం

**మంచాల, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆరుట్ల గ్రామానికి చెందిన పూజరి సమన్వి నవోదయ పాఠశాలలో సీటు సాధించింది. స్థానిక పుడమి పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఆమె, గత డిసెంబర్‌లో జరిగిన ప్రవేశ పరీక్షలో 88.75 శాతం మార్కులతో 69వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ రెడ్డి, ఉపాధ్యాయులు అనురాధ, రమణతో పాటు టీచర్ల బృందం, కుటుంబ సభ్యులు సమన్విని అభినందించారు. తల్లిదండ్రులు పూజరి స్వాతి--రమేశలు ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి స్వీట్లు పంచిపెట్టారు.

# మైనార్టీ సోదరులకు రంజాన్ కానుక




**నాగర్‌కర్నూల్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని మైనార్టీ సోదరుల కోసం బిన్ మహెఫూజ్ మసీదులో రంజాన్ కానుకల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి పాల్గొని ముస్లిం సోదరులతో స్నేహపూర్వకంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “రంజాన్ పండుగ శాంతి, సహనం, సోదరభావానికి ప్రతీక. ప్రభుత్వం మైనార్టీ సమాజ అభివృద్ధికి కట్టుబడి ఉంది. విద్య, ఉపాధి, స్వయం ఉపాధి రంగాల్లో మరింత ప్రోత్సాహం అందించేందుకు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. మైనార్టీ సోదరులు ఈ పథకాలను వినియోగించుకోవాలి” అని పేర్కొన్నారు. అతను ముస్లిం సమాజానికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో ఐక్యత, సామరస్యాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, కౌన్సిలర్లు నిజాం, నజీమా, ఇస్తాక్ అహ్మద్ ఖాన్, ఆసిఫా బేగం, ఖాదర్, కూచుకుళ్ల సింధు, ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు, యువకులు, పెద్ద సంఖ్యలో మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

## బెంగాల్‌లో 13మంది ఐఎఎస్‌ల బదిలీ

**కోల్‌కతా : మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అసెంబ్లీ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లో ఎన్నికల సంఘం (ఇసి) బుధవారం 13 మంది ఐఎఎస్‌లను బదిలీ చేసింది. పలువురు జిల్లా మెజిస్ట్రేట్‌లు (డిఎం)లను నియమించడంతో పాటు, వారిని జిల్లా ఎన్నికల అధికారులుగా (డిఇఒ)కూడా నియమించి, ఎన్నికల పరిశీలకులుగా కీలక బాధ్యతలను అప్పగించాలని ఆదేశించింది. జితిన్‌యాదవ్ (కూచ్ బెహార్), సందీప్ ఘోష్ (జల్పాయి గరి), వివేక్ కుమార్ (ఉత్తర దినాజ్‌పూర్), రాజన్వీర్ సింగ్ కపూర్ (మాల్డా) మరియు ఆర్.అర్జున్ (ముర్షిదాబాద్) సహా పలువురు అధికారులను జిల్లా మెజిస్ట్రేట్ కమ్ డిస్ట్రిక్ పోల్ ఆఫీసర్స్‌గా నియమించినట్లు ఇసి తెలిపింది. స్మితా పాండే కోల్‌కతా మునిసిపల్ కార్పోరేషన్ కమిషనర్‌గా, కోల్‌కతా నార్త్ డిఇఒగా నియమితులవగా, రణధీర్ కుమార్ కోల్‌కతా సౌత్ డిఇఒగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు బదిలీ అయిన అధికారులను ఎన్నికలకు సంబంధించిన ఏ విధుల్లోనూ నియమించకూడదని ఇసి ఆదేశించింది.

## వృద్ధి పంతం వేళ...

# చమురు సంక్షోభం!



ప్రపంచ ఆర్థిక రంగంలో అనిశ్చితి నీడలు కమ్ముకున్న వేళ, భారత్ మాత్రం తన వృద్ధి పథాన్ని దృఢంగా కొనసాగిస్తోంది. ప్రపంచ దేశాలన్నిటికీ అసూయ కలిగించేలా 7.4 శాతం జీడీపీ వృద్ధి రేటును సాధించడం గర్వకారణం. చైనా, అమెరికా, బ్రిటన్, జపాన్, ఫ్రాన్స్ వంటి అభివృద్ధి చెందిన దేశాలకన్నా అధిక వృద్ధి రేటు నమోదు చేయడం భారత ఆర్థిక శక్తికి నిదర్శనం. అయితే ఈ విజయగాథకు సమాంతరంగా అంతర్జాతీయ పరిణామాలు కొత్త సవాళ్లను విసురుతున్నాయి.ప్రత్యేకంగా ఇరాన్ చుట్టూ నెలకొన్న యుద్ధ వాతావరణం భారత్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతి దేశంగా ఉన్న భారత్‌కు హర్ముజ్ జలసంధి కీలక మార్గం. ఈ మార్గం ద్వారా సుమారు 50 శాతం చమురు దిగుమతులు జరుగుతుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ మార్గంలో అంతరాయం కలిగితే దేశ ఆర్థిక వ్యవస్థపై గణనీయ ప్రభావం పడటం ఖాయం. ఇలాంటి పరిస్థితులను ముందుగానే అంచనా వేసిన కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. గోవాలో నిర్వహించిన భారత ఇంధన వారంలో రష్యా, ఇరాక్, సౌదీ అరేబియా దేశాలతో కీలక వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం జరిగింది. ముఖ్యంగా సౌదీ అరేబియాతో 200 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యాన్ని నిర్దేశించడం దేశ ఇంధన భద్రతకు బలమైన పునాది. పారంపరిక ఇంధన వనరులపైనే ఆధారపడకుండా పునర్వినియోగ ఇంధన రంగంలో భారత్ వేగంగా ముందుకు సాగుతోంది. సౌర విద్యుత్ ఉత్పత్తిలో ప్రపంచంలో మూడో స్థానంలో, పవన విద్యుత్ సామర్థ్యంలో నాల్గో స్థానంలో, మొత్తం పునర్వినియోగ ఇంధన సామర్థ్యంలో కూడా నాల్గో స్థానంలో నిలవడం విశేషం. భవిష్యత్‌లో చమురు ఆధారాన్ని తగ్గించే దిశగా ఇది కీలక మార్గం. దేశవ్యాప్తంగా చమురు నిల్వలను పెంచే దిశగా పెట్రోలియం మరియు సహజ వాయువు శాఖ సమన్వయంతో చర్యలు కొనసాగుతున్నాయి. భారత్‌ను ఇంధన పరంగా స్వావలంబన వైపు తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం కట్టుదిట్టమైన ప్రణాళికను అమలు చేస్తోంది. ప్రస్తుతం దేశంలో సుమారు 120 రోజుల అవసరాలకు సరిపడ చమురు నిల్వలు ఉండటం కొంత ఊరటనిచ్చే అంశం. అంతర్జాతీయ ఉద్రిక్తతల మధ్య భారత్ తటస్థ విధానాన్ని అనుసరిస్తూ ప్రపంచ దేశాలతో సత్సంబంధాలను కొనసాగిస్తోంది. ఈ దౌత్య సమతుల్యత కారణంగా చమురు సరఫరా వ్యవస్థలో ఇప్పటివరకు ఎలాంటి పెద్ద అంతరాయాలు చోటుచేసుకోలేదు. చమురు వాహక నౌకల రవాణా కూడా సజావుగానే కొనసాగుతోంది. గ్యాస్ వినియోగంలో కూడా ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు చేపట్టింది. గృహ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా బుకింగ్ వ్యవధిని 20 రోజుల నుండి 45 రోజులకు పెంచడం జరిగింది. కమర్షియల్ గ్యాస్ వినియోగాన్ని నియంత్రిస్తూ, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సమతుల్యత పాటిస్తోంది. అదే సమయంలో ఆసుపత్రులు, ప్రభుత్వ విద్యాసంస్థలు, హాస్టళ్ల వంటి అత్యవసర విభాగాలకు కమర్షియల్ గ్యాస్ వినియోగంలో సడలింపులు ఇవ్వడం ప్రజాహిత దృక్పథానికి నిదర్శనం. అయితే ఈ చర్యలు తాత్కాలిక ఉపశమనం మాత్రమే. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం కొనసాగితే దీర్ఘకాలికంగా ఆర్థిక ఒత్తిడి పెరగడం అనివార్యం. అందుకే భారత్ కేవలం తటస్థంగా ఉండటం కాకుండా, అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించే దిశగా చురుకైన దౌత్యపాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. ప్రపంచానికి మార్గనిర్దేశం చేసే స్థాయికి ఎదుగుతున్న భారత్, శాంతి స్థాపనలో నాయకత్వాన్ని ప్రదర్శించాల్సిన సమయం ఇదే. దేశీయంగా కూడా రాజకీయ విభేదాలను పక్కనబెట్టి, జాతీయ ప్రయోజనాల దిశగా ముందుకు సాగాలి. గ్లోబల్ మార్కెట్ అస్థిరతలు, ఇంధన సంక్షోభాలు వంటి సవాళ్లను ఎదుర్కొంటూ భారత్ తన వృద్ధి పథాన్ని నిలబెట్టుకోవాలంటే సమన్వయం, దూరదృష్టి, సమష్టి కృషి అత్యవసరం. వృద్ధి లక్ష్యాన్ని కాపాడుకుంటూనే సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కొనగలిగితేనే భారత్ నిజమైన ఆర్థిక శక్తిగా నిలుస్తుంది. లేదంటే చమురు సంక్షోభం వృద్ధి పథానికి అడ్డంకిగా మారే ప్రమాదం ఉంది.

### వ్యాసకర్త

-- గోరుపాటి శంకర్
అసోసియేట్ ఎడిటర్
ఎం.ఏ తెలుగు, ఉస్మానియా విశ్వవిద్యాలయం।
ఎం.సి.జె.



# గొలుసుల సంతోష్ ను పరామర్శించిన 14వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు

**వరంగల్, మార్చి 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని ఏనుమాముల ఇందిరమ్మ కాలనీ ఫేజ్-1 గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొలుసుల సంతోష్ తల్లి గొలుసుల మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు.

విషయం తెలుకున్న 14వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వారి స్వగ్రామమైన పరకాల మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపురం గ్రామంలోని నివాసానికి వెళ్లి మల్లమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ



సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పస్తం శంకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పత్రి రాజేష్, ఎనుమాముల గ్రామ శాఖ అధ్యక్షుడు సౌరం చిన్నయ్య, ఎన్టీఆర్ నగర్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఈర్ల రాజేందర్, ఎస్సార్ నగర్ గ్రామ శాఖ అధ్యక్షుడు మచ్చర్ల స్టాలిన్, సుందరయ్య నగర్ గ్రామ శాఖ అధ్యక్షుడు త్రికోవేల శ్రీను, డివిజన్ కాంగ్రెస్ నాయకులు కుంభం శివపటేల్, నర్సింగోజు నరేంద్ర చారి, బండ్ల సురేందర్, రచ్చ శ్రీకాంత్, సౌరం ప్రభాకర్, సౌరం మాణిక్యం, దామెర అభికేశం, సోషల్ మీడియా నాయకులు గంధం సారంగపాణి, యూత్ నాయకులు రాకేష్, భరత్, ప్రశాంత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ ఏజెన్సీలలో ఆకస్మిక తనిఖీలు

**మహబూబాబాద్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో గ్యాస్ సరఫరా పకడ్బందీగా కొనసాగాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్‌కుమార్ ఆదేశించారు. బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని రైల్వే గేట్ ప్రాంతం హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ, మల్యాలలోని శ్రీధర ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ గోదాములను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములో నిల్వ ఉన్న గ్యాస్ వివరాల రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్లు, ఆన్లైన్ జాబితాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ సరఫరా చేయాలని, డబుల్ సిలిండర్లు తీసుకున్న వారిని గుర్తించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సరఫరా కొనసాగించాలని ఆయన సూచించారు. విజిలెన్స్ కమిటీ సభ్యులు నిత్యం




ఏజెన్సీలలో పంపిణీ ప్రక్రియలను పరిశీలించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా సరఫరా చేస్తున్న గ్యాస్ సిలిండర్లపై కేసముద్రం మండలం ఉప్పరపల్లిలో నాలుగు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం డిమాండ్‌కు అనుగుణంగా జిల్లాలో గ్యాస్ నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అనవసరంగా ముందస్తు బుకింగ్‌లు చేయరాదని, ప్రభుత్వ సూచనల ప్రకారం 25 రోజుల తర్వాతనే గృహ అవసరాల కోసం గ్యాస్ బుక్ చేసుకోవాలని సూచించారు. గ్యాస్ కొరత ఉందని తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రమేష్ నాయక్, స్థానిక తహసీల్దార్ రాజేశ్వర్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతం



**తలకొండపల్లి, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో కామినేని ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతంగా జరిగింది. స్థానిక సర్పంచ్ వానరాశి రాములమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సీ.ఎల్. శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా శిబిరాన్ని ప్రారంభించారు.కామినేని ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చందన, లింగస్వామి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 130 మందికి వివిధ పరీక్షలు చేశారు. కంటి పరీక్షలు, కీళ్ల నొప్పులు, సర్ది, జ్వరం, దగ్గు వంటి సమస్యలకు వైద్య సేవలు అందించి ఉచిత మందులు పంపిణీ చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్‌రెడ్డి వైద్య సిబ్బందిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివ విజయలక్ష్మి, మాజీ జెడ్పీ కోఆప్షన్ ముజీబుర్ రహమాన్, మాజీ ఎంపీటీసీలు జి. శ్రీనివాసమూర్తి, ఎం. అంబాజీ, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఏ. అంజయ్య గౌడ్, మాజీ ఉపసర్పంచ్‌లు బి. నర్సింలు, అజీజ్, వార్డు సభ్యులు వి. శేఖర్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కృష్ణయ్య గౌడ్, మండల కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు ఎం.డి. ఆరిఫ్, నాయకులు పి. అశోక్ బాబు, వానరాశి వెంకటేష్, ఏ. వెంకట్‌రెడ్డి, ఎం. బాలకిష్టయ్య, వద్దే రాజు, సి. లింగం యాదవ్, పులిజాల విష్ణు, పిరికేటి దశరథం, టీ. రాఘవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బోనాల పండుగ వేడుకల్లో నిమ్మాని శేఖర్ రావుకు ఘన స్వాగతం

**-నిమ్మాని శేఖర్ రావు కు శాలువా కప్పి సన్మానం చేసిన టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్**



**వర్ధన్నపేట, మార్చి 18(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఐనవోలు మండలం పంతిని గ్రామంలో బోనాల పండుగ వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. శ్రీ కంఠమహేశ్వర స్వామి బోనాల పండుగ వేడుకలు ఉత్సాహంగా కొనసాగుతూ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన టీపీసీసీ లీగల్ సెల్ వైస్ ప్రెసిడెంట్ నిమ్మాని శేఖర్ రావు కు గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ నిమ్మాని శేఖర్ రావు ను సాదరంగా ఆహ్వానించి శాలువా కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, భక్తులు ఆయనకు పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు .ఈ కార్యక్రమంలో గౌడ బాంధవులు,స్థానిక నాయకులు,గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణిలో అవినీతి ఆరోపణలు



**మంథని, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: సింగరేణి కాలరీస్ కంపెనీలో యంత్రాలు, విడిభాగాల కొనుగోళ్లలో భారీ అవినీతి జరుగుతోందని ఆరోపణలు వెలువడ్డాయి. కొందరు అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై మార్కెట్ ధరలకు మించి కొనుగోళ్లు జరిపి కంపెనీకి నష్టం కలిగిస్తున్నారని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీటీసీ ల పురం నాయకుడు మొలుమూరి శ్రీనివాస్ తెలిపారు.ఈ అక్రమాల వల్ల ప్రభుత్వానికి, ప్రజల సంపదకు నష్టం జరుగుతోందని, సంస్థ ప్రతిష్ట దెబ్బతింటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సంబంధిత ఆధారాలతో సింగరేణి సీఎండీ, డైరెక్టర్ (పర్సనల్ ఽ అడ్మినిస్ట్రేషన్)కు అధికారిక ఫిర్యాదు సమర్పించనున్నట్టు తెలిపారు. అవసరమైతే విజిలెన్స్, ఏసీబీ వంటి సంస్థలకు కూడా ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.సింగరేణి సంస్థ పారదర్శకంగా, నిష్పాక్షికంగా పనిచేయాలని, కార్మికుల భవిష్యత్తు, ప్రజల నమ్మకాన్ని కాపాడాలని ఆయన కోరారు. ఈ అవినీతి అన్ని డివిజన్లలో జరుగుతోందని, వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ పార్టీ డిమాండ్ చేస్తోందని తెలిపారు.

# ప్రత్యేక కథనం । సంస్కృతి – సమాజం

**"ఉగాది అంటే తెలియని తరం?**
**-- పరాభవ నామ సంవత్సరంలో ఆత్మపరిశీలన అవసరం"**





నేటి సమాజంలో ఓ విస్మయకర దృశ్యం కనబడుతోంది. జనవరి 1 నూతన సంవత్సరాన్ని యువత అత్యంత ఉత్సాహంతో జరుపుకుంటుండగా, మన సంప్రదాయ ఉగాది పండుగపై మాత్రం అదే స్థాయి ఆసక్తి కనిపించడం లేదు. ఇది కేవలం ట్రెండ్ మార్పు కాదు---మన సంస్కృతి మూలాలను మరిచిపోతున్నామనే సంకేతం.

ఉగాది అంటే "యుగాది"---యుగానికి ఆరంభం. ఇది కేవలం తేదీ మార్పు కాదు; కొత్త ఆలోచనలకు, కొత్త జీవన విధానానికి శ్రీకారం. చైత్ర మాసం, శుక్ల పక్ష పాడ్యమి రోజున జరుపుకునే ఈ పండుగ, హిందూ చంద్ర--సౌర కాలగణన ప్రకారం నిజమైన నూతన సంవత్సరం. 'ఉదయం" అనే భావన కూడా ఉగాదిలో అంతర్లీనంగా ఉంది. చీకటి తర్వాత ఉదయం వచ్చినట్లే, కష్టాల తర్వాత సంతోషం వస్తుందని జీవన సత్యాన్ని ఈ పండుగ చాటి చెబుతుంది. అందుకే ఉగాది కేవలం పండుగ కాదు---ఒక జీవన తత్వం.

**వైదిక కాలచక్రం -- పరాభవ సంవత్సరం సందేశం**

హిందూ వైదిక కాలగణనలో 60 సంవత్సరాలు ఒక పూర్తి చక్రం. ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక శక్తిని, ఒక జీవన సందేశాన్ని అందిస్తుంది. ప్రస్తుతం కొనసాగుతున్నది "పరాభవ నామ సంవత్సరం".

"పరాభవం" అంటే సాధారణంగా ఓటమి అని భావించినా, వైదిక దృష్టిలో ఇది ఆత్మపరిశీలనకు సంకేతం.

**ఈ సంవత్సరం మనకు నేర్పేది---**

- తప్పులను అంగీకరించాలి
- గతాన్ని విశ్లేషించాలి
- కొత్త దిశలో ముందుకు సాగాలి

అహంకారాన్ని తగ్గించి, వినయంతో జీవిస్తూ, సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలనే సందేశాన్ని ఈ సంవత్సరం అందిస్తోంది. వ్యక్తిగత విజయాలకే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతలను గుర్తుచేసే కాలమిది.

**పంచాంగ శ్రవణం -- శాస్త్రోక్త విజ్ఞానం**

ఉగాది రోజున పంచాంగ శ్రవణం ఒక గొప్ప సంప్రదాయం మాత్రమే కాదు---శాస్త్రీయ దృక్పథం కలిగిన విధానం కూడా. ఇందులో---

- వర్షపాతం అంచనాలు
- వ్యవసాయ పరిస్థితులు
- ఆర్థిక మార్పులు
- రాజకీయ పరిణామాలు
- ప్రజల జీవన విధానం

ముందుగానే విశ్లేషించబడతాయి. ఇది కేవలం జ్యోతిష్య ప్రకటన కాదు; ప్రకృతి, గ్రహగతులు, కాలచక్రంపై ఆధారపడిన సమగ్ర అవగాహన.

**ఉగాది పచ్చడి -- జీవన తత్వ సందేశం**

ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు మన జీవితంలోని అనుభవాలను ప్రతిబింబిస్తాయి---

- తీపి – ఆనందం
- చేదు – బాధ
- పులుపు – ఆశ్చర్యం
- కారం – కోపం
- ఉప్పు – ఆసక్తి
- వగరు – భయం

జీవితం ఒక్కటే కాదు---అనేక భావాల సమ్మేళనం. వాటిని సమానంగా స్వీకరించడమే జీవన విజ్ఞానం అని ఉగాది పచ్చడి బోధిస్తుంది.

**యువత & మారుతున్న ప్రాధాన్యతలు**

సోషల్ మీడియా ప్రభావం, పాశ్చాత్య సంస్కృతి ఆకర్షణ---ఇవి యువతను ట్రెండ్స్ వైపు నడిపిస్తున్నాయి. జనవరి 1 వేడుకలు ఘనంగా జరుపుకుంటూ, ఉగాదిని సాధారణ రోజుగా చూడటం ఆందోళనకరం.

- ఫ్యాషన్, పార్టీలు, ట్రెండ్స్ ప్రాధాన్యం పెరుగుతోంది
- సంప్రదాయాలు క్రమంగా వెనుకబడుతున్నాయి

ఇది పూర్తిగా తప్పు కాదు... కానీ అసంపూర్ణం. కొత్తదాన్ని స్వీకరించడం అవసరం---కానీ పాతదాన్ని మరచిపోవడం కాదు.

**మన సంస్కృతి -- మన గుర్తింపు**

భారతీయ సంస్కృతి వేల ఏళ్ల చరిత్రను కలిగి ఉంది. ఉగాది వంటి పండుగలు ప్రకృతి, కాలం, మనిషి జీవన విధానాన్ని ఒకే తాటిపైకి తెస్తాయి.

**ఉగాది = ప్రకృతి + కాలం + జీవితం**


మన సంస్కృతిని కాపాడుకోవడం అంటే మన మూలాలను, మన వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడం.

**ఉగాది మనకు నేర్పేది---**

- ప్రతి ముగింపు ఒక కొత్త ఆరంభం
- ప్రతి కష్టం ఒక పాఠం
- ప్రతి సంవత్సరం ఒక అవకాశం

"పరాభవ నామ సంవత్సరం" చెబుతున్న సందేశం---
"తగ్గడం కూడా ఎదుగుదలలో భాగమే."
యువత ఉగాదిని అర్థం చేసుకుంటేనే సంస్కృతి నిలుస్తుంది.
సంస్కృతి నిలిస్తేనే మన గుర్తింపు నిలుస్తుంది.


**గుగులోత్ నాగు**
B.Li.Sc, M.Li.Sc, MCJ, LL.B
జాతీయ సామాజిక వేత్త । రచయిత



# తండ్రి, కుమార్తె సజీవ దహనం

**- అల్లుడే చంపినట్లు అనుమానం**





**హన్మకొండ మార్చ్ 18 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :**
హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండలో దారుణం చోటు చేసుకుంది. తండ్రీ కుమార్తెలు సజీవ దహనమయ్యారు. అల్లుడు ప్రవీణ్ కుటుంబ కలహాలతో ఇద్దరినీ సజీవదహనం చేసినట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కడిపికొండ రాజీవ్ గృహకల్పలో నిన్న తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. భాషబోయిన రాజశేఖర్ (54) అతని కుమార్తె రాజశ్రీ (24) మంటల్లో కాలిపోతుంటే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే, ఆటో డ్రైవర్గా పని చేస్తున?న భాషబోయిన రాజశేఖర్కు ముగ్గురు కుమార్తెలు కాగా రాజశ్రీ పెద్దమ్మాయి. అల్లుడు ప్రవీణ్ హైదరాబాద్లో ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. వీరికి మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. రెండేళ్ల బాబు, ఆరు నెలల పాప ఉన్నారు. సంక్రాంతి పండుగకు పిల్లలతో వచ్చి తండ్రితో పాటే హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండలోని రాజీవ్‌గృహకల్పలో బ?లాక్ 5లో ఉంటోంది. కుటుంబ తగాదాలు, భార్యతో గొడవలు జరుగుతున్నాయని సమాచారం. ఈ తరుణంలో రాజశేఖర్, రాజశ్రీ (24) సజీవ దహనమైయారు. భార్యతో గొడవలు తదితర కారణాలతో అల్లుడు ప్రవీణే భార్య, మామను హత్య చేసి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుత్తితో తలమీద కొట?టి ఇద్దరిపైన డీజిల్ పోసి తగలుబెట్టి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేశాడని అనుమానిస్తున్నారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. ప్రవీణ్ను అదుపులోకి తీసుకొని విచారిస?తున్నారు. పోలీసుల విచారణలో ప్రవీణ్ పొంతనలేని సమాధానాలు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిన్నటివరకూ బాగానే ఉన్న తండ్రీ కుమార్తెలు ఇద్దరూ మంటల్లో కాలిపోయి మృతి చెందడంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. రాజశ్రీ చనిపోవడంతో రెండేళ్ల బాబు, ఆరు నెలల పాప అనాథలయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "భాషబోయిన రాజశేఖర్ ముగ్గురు కుమార్తెలు. రాజశేఖర్ భార్య పిల్లల బాల్యంలోనే మృతి చెందారు. రాజశ్రీని ప్రవీణ్కి ఇచ్చి పెళ్లి చేశారు. సంక్రాంతి పండుగకు తండ్రి వద్దకు పిల్లలతో వచ్చిన రాజశ్రీ అత్తగారింటికి వెళ్లలేదు. భార్యభర్తలు మధ్య చిన్న చిన్న గొడవలు జరుగుతుండేవి. కుటుంబ తగాదాలు ఉన్నట్లు తెలిసింది. మాకు ఎప్పుడు కూడా చెప్పలేదు. రాజశ్రీ ప్రవీణ్కి ఇద్దరు సంతానం. రెండేళ్ల బాబు, ఆరు నెలల పాప ఉన్నారు"

# భగత్ సింగ్,రాజ్ గురు,సుఖదేవ్ లస్మారకంగా విద్యార్థి,యువజనోత్సవాలను జయప్రదం చేయండి

-ఎస్ఎఫ్ఐ,డివైఎఫ్ఐ.




**దేవరకొండ మార్చి 18. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ఎస్ఎఫ్ఐ,దేవరకొండ మండల కమిటీల ఆధ్వర్యంలో భగత్ సింగ్,రాజ్ గురు,సుఖదేవ్ ల 95 వర్ధంతి సందర్భంగా విద్యార్థి యువజనోత్సవాలు మార్చి 15 నుంచి 23 వరకు నిర్వహించే ఉత్సవాల పోస్టర్ ను దేవరకొండ పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వేంకటేష్ ఆవిష్కరించి ఈ సందర్భంగా మాట్లాడుతూ,భగత్ సింగ్,రాజ్ గుర్,సుఖదేవ్ ల ఆశయ సాధన కోసం యువత,విద్యార్థులు వారి ఆశయ సాధనకు కృషి చేయాలని, డ్రగ్స్ మారకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. అదేవిధంగా నేటి సమాజంలో విద్యార్థులు,యువత గంజాయి, డ్రగ్స్,మాదకద్రవ్యాలు బెట్టింగ్లకు దూరంగా ఉంటూ ఉన్నతమైన స్థాయిలో ముందుకు పోయే విధంగా ఉండాలని, ఈ పోటీ ప్రపంచంలో నిలబడి ఉండాలంటే చదువు ఒక్కటే మార్గమని అన్నారు, అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గల్లి స్థాయిలో త్యాగాలు చేయలేని వారు కూడా ఢిల్లీ స్థాయిలో ప్రచార ప్రచారాలు చేస్తున్నాయి తప్ప భగత్ సింగ్ రాజ్ గుర్, సుసుఖ్ దేవ్ లను ప్రచారం చేయాలంటే జంకుతున్నాయని, 23 సంవత్సరాలు వయసులోనే దేశ స్వాతంత్రం కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా వదిలేసిన షాహిద్ భగత్ సింగ్, రాజ్ గుర్, సుసుఖ్ దేవ్ లకు భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరైన పద్ధతి కాదని అన్నారు .తక్షణమే వారి సేవలను గుర్తించి భారతరత్న అవార్డు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎ.రాజేష్,ఎం లాలు,ఏ.ఈశ్వర్, ఎం అఖిల్,సి.చరణ్,శివ గణేష్, కె.అజయ్,జె.రాజేష్,ఉదయ్ కుమార్, శ్రీధర్,మనోజు, యశ్వంత, శ్రీకాంత్,శివ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పరాభవ సంవత్సరం ప్రగతి ప్రజ్వలితానికి దిక్సూచి కావాలి

పరాభవం అంటె
మనిషిలో ఉన్న అహంకారం
గర్వం స్వార్థం సంకుచితత్వం
నిరంకుశత్వం నశించి పోవడం
చెడు పరాభవం కావడం
ఓడిపోవడం

పరాభవ నామ సంవత్సరం
మనలోని కామ క్రోధ లోభ
మోహాలను జయించే శక్తి
సామర్థ్యాలు ఇవ్వాలి

అహంకారంతో విర్రవీగే
పాలకులు ప్రజా శ్రేయస్సే
లక్ష్యంగా పాలనను
చేపట్టడానికి పరాభవం
ప్రభావశీల ప్రగతికి
మార్గదర్శి కావాలి

సవాళ్లను అధిగమిస్తూ
సహనంతో ముందుకు
సాగితే విజయాలు
సిద్ధిస్తాయనే స్ఫూర్తికి
ఉగాది ప్రేరక శక్తి
కావాలి

పేరులో పరాభవం ఉన్నా
మనసుల మనుషుల్లో
భయాన్ని పారదోలాలి

అపనమ్మకాలను
అపజయాలను తుంచి
విజయ సాధన
సామర్థ్యాలను
జనావళికి అందించాలి

షడ్రుచుల పచ్చడిలో
తీపి ఆశల పరవళ్ళు
కష్ట సుఖాల కలబోతలో
ధైర్యమే మన ఊపిరి
కావాలి

వేప పువ్వు చేదును
చిరునవ్వుతో స్వీకరిద్దాం
మామిడి వగరును
కొత్త ఉత్సాహంగా
మలుచుకుందాం
బెల్లం తీపిలా
అనురాగ బంధాలను
పెంచుకుందాం
చింత పండు పులుపుగా
జీవితాన్ని రుచిగా
మార్చుకుందాం

గత కాలపు సమస్యలు
సవాళ్లు చింతలు చికాకులు
నేటితో మాయం కావాలి
పలకరింపులు పులకరింపులై
సమాజంలో సంతోషాలు
ఆనందాలు వర్ధిల్లాలి

పట్టుదల ఆత్మవిశ్వాసం
స్వయం సంకల్పశక్తితో
ఆత్మనిర్భరతతో
స్వయం స్వమృద్ధ
స్వాభిమాన భారత
నిర్మాణ సామర్థ్యాలను
యువతలో పెంచటానికి
పరాభవ సంవత్సరం
ప్రభావితం చూపాలి

మహిళా సాధికారిత
యువత సాధికారిత
నైపుణ్య భారత్ తో
ప్రతిభ ప్రగతి శీల
నవ సమాజ నిర్మాణంతో
పటిష్ట భారత్ ఆవిర్భావానికి
శ్రీ పరాభవ సంవత్సరం
వారధి కావాలి

అందరి జీవితాల్లో
సిరిసంపదలు
సుఖ శాంతులు
నింపాలని ఆకాంక్షిస్తూ

వికసిత భారత లక్ష్య
సాధనకు ప్రభుత్వం
పౌరసమాజం
స్వచ్ఛందంగా
ముందుకు వచ్చే
మానసిక వాతావరణాన్ని
సృష్టించాలి

నూతన ఉగాది
అందరి జీవితాల్లో
సరికొత్త కాంతులు నింపాలి
ప్రతి ఇంట ప్రశాంతత
ప్రగతి శీల ఆలోచనలు
సంతోషాల సిరివెన్నెలలు
కురిపించాలి

చెడు జ్ఞాపకాలు మరిచి
కొత్త తీపి ఆశలతో
ఆశావహ దృక్పథంతో
నూతన సంవత్సరాన్ని
ఆహ్వానిద్దాం
తెలుగు సంస్కృతిని
పరిరక్షిద్దాం.

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్
ఫోరం
కాలమిస్ట్
ఫ్రీలాన్స్ రచయిత
కరీంనగర్9440245771



## తెలుగు ప్రజలందరికీ శ్రీ పరాభావ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

- ఆర్టీఐ ఆక్టివిస్ట్ సొసైటీ-2005 వ్యవస్థాపక&అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్



**దేవరకొండ మార్చి 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ముఖ్యంగా సమాచార హక్కు చట్టం కార్యకర్తలకు శ్రీ పరాభావ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా ఆర్టీఐ ఆక్టివిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు ప్రజల జీవితాల్లో ఈ కొత్త ఏడాది సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిలాగే, ప్రజలందరి జీవితాలు సుఖదుఃఖాలను సమానంగా స్వీకరిస్తూ, విజయపథంలో సాగాలని కోరారు. ముఖ్యంగా సమాచార హక్కు చట్టం ద్వారా సామాన్యుడికి బలం చేకూర్చేందుకు కృషి చేస్తున్న కార్యకర్తలందరూ ఈ ఏడాది మరింత ఉత్సాహంతో, పారదర్శకమైన సమాజం కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. లోకమంతా సుభిక్షంగా ఉండాలని, రైతాంగం పాడిపంటలతో విరాజిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాంగ శ్రవణం



**తిమ్మాపూర్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ సందర్భంగా గురువారం ఉదయం 10.30 గంటలకు ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రకటించింది. ఈ కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఎల్ఎండీ కాలనీలోని శ్రీ తాపాళ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అర్చకులు గోవర్ధన వెంకటాచార్యులు, గోవర్ధన శ్రీకాంతాచార్యులు పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. పరాభవ నామ సంవత్సరానికి సంబంధించిన రాశుల ఫలితాలు, గోచారాలు, గ్రహస్థితులు వివరించనున్నారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కోరింది.


## భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి

-జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ కి వినతిపత్రం



**నల్లగొండ,మార్చి 18( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
భారతదేశ అత్యున్నత ప్రమాణిక గ్రంథమైన రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, జై భీమ్ మహాసేన జాతీయ అధ్యక్షులు రాజ్యాంగం అంజన్న డిమాండ్ చేశారు. ఈ రోజు వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కలెక్టర్ శ్రీ చంద్రశేఖర్ గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి హక్కులు, బాధ్యతలు, సమానత్వం వంటి విలువలను నేర్పే అత్యంత ముఖ్యమైన పత్రం అని తెలిపారు. భావి భారత పౌరులుగా ఎదుగుతున్న విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. కేరళ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చి, ప్రతి విద్యార్థికి రాజ్యాంగ పుస్తకాలను అందించిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ తీసుకుని పాఠ్యాంశాల్లో రాజ్యాంగాన్ని చేర్చి, విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలను పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దళితవాది విశ్వజన కళామండలి జాతీయ అధ్యక్షులు మాస్టర్జీ కెవిపియస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శీను, వంటపాక యాదగిరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో రైతాంగానికి భారీ నష్టం



**హుస్నాబాద్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గత రెండు రోజులుగా ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాల కారణంగా రైతులకు అపార నష్టం వాటిల్లిందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి, సైదాపూర్, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో మామిడి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంట నేలరాలిపోవడంతో రైతులు హరిగోశ పడుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి అని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈసారి మామిడి కాత భారీగా రావడంతో రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, అకాల వర్షాల కారణంగా వారికి దుఃఖమే మిగిలిందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.

## సింగరేణి కార్మికుల పెన్షన్ సమస్యలపై చర్చ




**న్యూఢిల్లీ, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ గడ్డం వంశీ కృష్ణ నేడు న్యూఢిల్లీలోని తన కార్యాలయంలో సిఎంపీఫ్ కమిషనర్ మరియు కోల్ కంట్రోలర్ సజీష్ కుమార్ ఎన్. ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోల్ మైన్స్ పెన్షన్ పథకం (సిఎంపీఫ్), 1998 కింద పదవీ విరమణ చేసిన సింగరేణి బొగ్గు కార్మికుల పెన్షన్ సమస్యలపై కీలకంగా చర్చ జరిగింది. ప్రస్తుతం రిటైర్ అయిన కార్మికులకు వస్తున్న పెన్షన్ చాలా తక్కువగా ఉండటంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీ వంశీ కృష్ణ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జీవితాంతం కష్టపడి పనిచేసిన కార్మికులు గౌరవప్రదమైన జీవితం గడపాలంటే వారి పెన్షన్లు తక్షణమే పెంచాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి కేంద్ర ప్రభుత్వం స్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు సానుకూలంగా స్పందిస్తూ, ప్రస్తుత నిబంధనల ప్రకారం పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో ముందస్తు ఉగాది వేడుకలు



**కరీంనగర్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల బోటనీ విభాగంలో పరాభవ నామ ఉగాది పండుగను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఉప ప్రిన్సిపాల్ నితిన్ పాటక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విభాగాధిపతి ప్రొఫెసర్ తిరుకోవెల శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో స్టాఫ్ క్లబ్ కార్యదర్శి మల్లారం శ్రీనివాస్ ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఉగాది పండుగ ప్రాముఖ్యతను ఉప ప్రిన్సిపాల్ వివరించి, ఇది కొత్త ఆశలు, కొత్త ఆరంభాలకు సంకేతమని, ఉగాది పచ్చడి జీవనంలోని సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించాల్సిన అవసరాన్ని తెలియజేస్తుందని అన్నారు. విభాగాధిపతి మాట్లాడుతూ, వసంత ఋతువులో మొక్కలు కొత్త చిగురులు తొడుగుతున్నట్లే మన జీవితాల్లో కూడా కొత్త ఆశలు పుట్టాలని, ప్రకృతి పరిరక్షణలో విద్యార్థులు ముందుండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉగాది ప్రాధాన్యంపై ప్రసంగాలు, కవితలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. చివరగా అందరూ కలిసి ఉగాది పచ్చడి రుచి చూసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

# పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహిస్తున్న గణాంక శాఖ అధికారి



**కరీంనగర్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో 2026వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో భాగంగా కరీంనగర్ జిల్లా బోయిన్‌పల్లి, స్తంభంపల్లి, గుండన్నపల్లె గ్రామాల్లో గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ పర్యటించారు. మొదట సాధారణ వివరాలు సేకరించి, అనంతరం ట్యాబ్ ద్వారా కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి వివరాలు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. కుటుంబ యజమాని పేరు, సభ్యుల విద్యా అర్హతలు, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలీల పనిగంటలు, వేతనాలు, మహిళల ఆదాయ వివరాలు వంటి అంశాలను నమోదు చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి ఎంపీడీవో జయశీల, పంచాయతీ కార్యదర్శులు మౌనిక, ఎండి జాఫర్ హైమద్, గ్రామ సర్పంచులు బోనగాని అశోక్ గౌడ్, కొప్పుల లావణ్య, ఉప సర్పంచ్ చంద్రగిరి అశోక్, చిలువేరి కిషన్, వార్డ్ సభ్యులు, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# స్టాంప్ పేపర్ల అక్రమ దందాపై ఫిర్యాదు




**కరీంనగర్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో వంద రూపాయల స్టాంప్ పేపర్ల కొరత తీవ్రంగా ఉందని, కొంతమంది లైసెన్స్ పొందిన స్టాంప్ వెండర్లు బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు వెలువడ్డాయి. ఈ విషయంపై రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అధికారికంగా ఫిర్యాదు చేశారు. వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లైసెన్స్ పొందిన ప్రతి వెండర్ వద్ద ప్రజలకు సరైన ధరకు స్టాంప్ పేపర్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఆయన కోరారు. బ్లాక్ విక్రయాల కారణంగా కరీంనగర్ పట్టణంలో తీవ్ర కొరత ఏర్పడిందని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వినతిపత్రం సమర్పణలో ఆర్‌పిఐ జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజేయ్, పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్, యం.ఎస్.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెంచల నవీన్, ఉపాధ్యక్షుడు కనకం నరేష్, బి.సి సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు గందే కొమురయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదరికాన్ని జయించిన పట్టుదల

-ఐబిపిఎస్ క్లర్క్‌గా ఆలేటి రామస్వామి.
-తల్లిదండ్రుల కష్టాన్ని చూసి కసిగా చదివి విజయం సాధించిన యువకుడు.



**దేవరకొండ మార్చి 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ఎంతటి కటిక పేదరికమైనా, ఎన్ని అడ్డంకులు ఎదురైనా దృఢ సంకల్పం ఉంటే విజయం వరిస్తుందని నిరూపించాడు ఆలేటి రామస్వామి. అట్టడుగు వర్గం నుండి వచ్చి, అత్యంత కఠినమైన ఐబిపిఎస్ , పరీక్షలో క్లర్క్ ఉద్యోగం సాధించి తన గ్రామానికి, జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. నల్గొండ జిల్లా, డిండి మండలం, ప్రతాప్ నగర్ గ్రామపంచాయతీ కి చెందిన పెద్దమరయ్య, పెద్దులమ్మ దంపతుల కుమారుడు రామస్వామి (23). రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి వారిది. తల్లిదండ్రులు ఇద్దరూ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ కొడుకును చదివించారు. తన కళ్ల ముందే తల్లిదండ్రులు పడుతున్న శ్రమను చూసి చలించిన రామస్వామి, ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించి వారి కష్టాలను తీర్చాలని నిశ్చయించుకున్నాడు. కేవలం 23 ఏళ్ల వయసులోనే, మొదటి ప్రయత్నాల్లోనే బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం సాధించడం రామస్వామి పట్టుదలకు నిదర్శనం. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఈ యువకుడు, సరైన వసతులు లేకపోయినా, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఏమాత్రం వెనకడుగు వేయలేదు. ఓర్పుతో, క్రమశిక్షణతో చదివి అనుకున్న లక్ష్యాన్ని ముద్దాడాడు. రామస్వామి సాధించిన ఈ విజయం పట్ల స్థానికులు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద కుటుంబం నుండి వచ్చి బ్యాంక్ ఉద్యోగం సాధించడం సామాన్యమైన విషయం కాదని, నేటి యువతకు రామస్వామి ఒక గొప్ప ఆదర్శమని కొనియాడుతున్నారు. రామస్వామి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అందరూ కోరుకుంటున్నారు.

# దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.



**దేవరకొండ మార్చి 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అన్నదాతలు తమ వ్యవసాయ పనులను ఉగాది నుండి కొత్తగా ప్రారంభిస్తారని, వ్యవసాయ నామ సంవత్సరంగా ఉగాది నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు.
ప్రకృతితో మమేకమై, వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలలో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్ణాలకు, ఉగాది గొప్ప పర్వదినం అని ఆయన పేర్కొన్నారు. ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనంలో ఆది పండుగగా ఉగాదికి ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. చెట్లు పచ్చగా చిగురిస్తూ, ప్రకృతి మాత నూతనోత్సాహాన్ని సంతరించుకుంటుందని, అదే నూతనోత్సాహం ప్రజల జీవితాల్లో నిండాలని కోరుకున్నారు. రైతన్నలు, సబ్బండ వర్గాల సంక్షేమం దిశగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపట్టి, ప్రజల జీవితాల్లో మరింతగా గుణాత్మక మార్పును తీసుకురావాలని ఆశించారు. అప్పుడే పరాభవ నామ నూతన సంవత్సరానికి సంపూర్ణత లభిస్తుందని ఆయన అన్నారు. ఉగాది పచ్చడి మాదిరి, జీవితంలో షడ్రుచులను ఆస్వాదిస్తూ ప్రతీ సందర్భాన్ని వివేచనతో ఎదుర్కోవడం ద్వారానే మంచి చెడులు అర్థమై జీవితానికి పరిపూర్ణత చేకూరుతుందని ఆయన తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో సాగునీరు తాగునీరు పుష్కలంగా లభించి, సమృద్ధిగా పంటలు పండి, ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.


# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



**తిప్పర్తి, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేమని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.డి. సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తిప్పర్తి మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. మంగళవారం గ్రామపంచాయతీ కార్మికులు చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించగా, సిఐటియు నాయకులను, కార్మికులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించారని ఆయన విమర్శించారు. సలీం మాట్లాడుతూ, "శాంతియుతంగా ధర్నా చేయడానికి వెళుతున్న నాయకులను అరెస్టు చేయడం తగదు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం 26,000 రూపాయలు ఇవ్వాలి. ప్రమాద బీమా, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి. వేతనాల కోసం ప్రత్యేక గ్రాంట్ ఏర్పాటు చేయాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. లేనిపక్షంలో కార్మికులు సమ్మెకు సిద్ధమవుతారు" అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తిప్పర్తి మండల కన్వీనర్ భీమగాని గణేష్, కెవిపిఎస్ జిల్లా నాయకులు బోల్లు రవికుమార్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు కంచర్ల జానయ్య, నాయకులు శరత్, అశోక్ రెడ్డి, రాజు, శివ, మైసయ్య, జానీ, వెంకటమ్మ, జానమ్మ, మరియమ్మ, పద్మ, చిన్న వెంకటమ్మ, మల్లమ్మ, పరమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్‌కు ఘన సన్మానం



**కరీంనగర్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్‌గా తొలిసారిగా గెలిచిన పొన్నం అశోక్ గౌడ్ కరీంనగర్ జిల్లా కోర్టుకు వచ్చిన సందర్భంగా జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయనను ఘనంగా సన్మానించారు. జిల్లా కోర్టు న్యాయవాదుల సమావేశ మందిరంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అశోక్ గౌడ్‌ను శాలువా, పూల బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,నా విజయం కోసం కృషి చేసిన న్యాయవాదులకు పేరు పేరున కృతజ్ఞతలు. బార్ కౌన్సిల్ కోసం కృషి కొనసాగుతుంది, అందరూ వెంట ఉండాలి అని అన్నారు. తరువాత పలువురు న్యాయవాదులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ బాధ్యులు భుక్య రజనీస్, కొత్త ప్రకాశ్, కె. శంకర్, సృజన్, గౌతం రాజ్, సీనియర్ న్యాయవాదులు పి. ప్రభాకర్ రావు, పి. సజన్ కుమార్, పెంచల లక్మన్ రావు, కూర శ్రీనివాస్ రెడ్డి, గంజి స్వరాజ్ బాబు, బి. నర్సింహ రెడ్డి, పి. వేణుగోపాల్, ఉప్పుల అంజన్ కుమార్, టి. పవన్, పి. రాజన్న, కె. శ్రీనివాస్, వి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు

## పార్వతి పరమేశ్వర కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న వెలిచాల రాజేందర్ రావు



**కరీంనగర్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పాత బజార్ శివాలయంలో బుధవారం జరిగిన పార్వతి పరమేశ్వర కళ్యాణ మహోత్సవంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పురాణం మహేశ్వర శర్మ ఆయనకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆకుల నర్మదా నర్సన్న, ఆకుల నందిని ఉదయ్, కాంగ్రెస్ నాయకులు జల్లోజు శ్రీనివాస్, రేగొండ సందీప్, దుగ్గు మహేందర్, పోరెడ్డి శ్రీధర్, పోరండ్ల రమేష్, వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుల--దివ్యాంగుల ఆశ్రమంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**కరీంనగర్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కిసాన్ నగర్‌లోని ప్రభుత్వ వృద్ధుల, దివ్యాంగుల ఆశ్రమాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమంలోని నివాస గదులు, వంటగది, తాగునీటి వసతి, టాయిలెట్స్‌ను పరిశీలించారు. గీజర్, శుద్ధ జల యంత్రాల పనితీరును కూడా పరిశీలించారు. అనంతరం వృద్ధులు, దివ్యాంగులతో ముచ్చటించి భోజనం నాణ్యత, వసతులపై వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన వారికి ట్రైసైకిల్ మరమ్మతులు చేయాలని, చేతి కర్రలు అందజేయాలని కలెక్టర్ దివ్యాంగుల శాఖ అధికారులను ఆదేశించారు. ఆశ్రమంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని, మరమ్మతులు చేసి పెయింటింగ్ వేయాలని సూచించారు. వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయాలని, ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ ఉండాలని తెలిపారు. డైట్ మెనూను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సూపరింటెండెంట్ నర్మద, వార్డెన్ రాధిక పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పదవ తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా కరీంనగర్ నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల నిఘా వ్యవస్థలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నాం. ప్రతి పరీక్షా కేంద్రంలో స్టాటిక్ ఫోర్స్ ను కేటాయించి నిరంతర నిఘా ఉంచాం. పరీక్షలు ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారు అని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇతర పోలీసు అధికారులు, విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నవోదయ పరీక్షలో ర్యాంక్ సాధించిన నిత్య శ్రీకి ఘన సన్మానం



**హుస్నాబాద్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సైదాపూర్ మండలం పెరుకపల్లి గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాల విద్యార్థిని కాశవేని నిత్య శ్రీ నవోదయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చి ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా గ్రామంలో ఆమెకు ఘన సన్మానం జరిగింది. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్ర చారి, గ్రామ సర్పంచ్ బబిత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సౌజన్య, ఉపాధ్యాయుడు గణేష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రతిభ పాల్గొని నిత్య శ్రీకి శాలువా కప్పి సత్కరించారు. ఎంఈఓ రవీంద్ర చారి మాట్లాడుతూ, నిత్య శ్రీ సాధించిన విజయం ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఫలితం. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలి అని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు, విద్యార్థులు నిత్య శ్రీ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు

## అకాల వర్షాలు పిడుగులతో రైతాంగానికి భారీ నష్టం

**హుస్నాబాద్ నియోజకవర్గం, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇటీవలి అకాల వర్షాలు, ఈదురుగాలులు, పిడుగుల ప్రభావంతో హుస్నాబాద్ నియోజకవర్గంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతంలో ఎండల కారణంగా వరి పంటలు ఎండిపోగా, ఇప్పుడు అకాల వర్షాల వల్ల కొంతమేర కాపాడుకున్న వరి, మొక్కజొన్న పంటలు పూర్తిగా నాశనం అయ్యాయి. మామిడి తోటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు చేతికి వచ్చేటప్పుడే పంటలు నష్టపోవడంతో ఆర్థికంగా కుంగిపోయారని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇంచార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి, వ్యవసాయ--రెవెన్యూ అధికారులు గ్రామాల వారీగా పర్యటించి నష్టాలను అంచనా



వేసి రైతులకు తక్షణ పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో కూడా అకాల వర్షాలు, ఎండల కారణంగా నష్టపోయిన పంటలకు సరైన పరిహారం అందలేదని, ప్రభుత్వం రైతులకు న్యాయం చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు గడిచినా రైతులకు నష్టపరిహారం విషయంలో నిర్లక్ష్యం చూపుతోందని ఆయన ఆరోపించారు. వరి పంటలకు ఎకరానికి రూ. 30,000, మామిడి తోటలకు ఎకరానికి రూ. 50,000 చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని, స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే జిల్లా--మండల అధికారులతో కలిసి నష్టాల అంచనాలు వేయించి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నకిలీ వస్తువులపై వినియోగదారులకు అవగాహన అవసరం - ఎస్. శ్రీలత



**కరీంనగర్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్‌పర్సన్ ఎస్. శ్రీలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వినియోగదారులు కొనుగోలు సమయంలో వస్తువుల నాణ్యత, పరిమాణం, ఉత్పత్తి గడువు తేదీ వంటి వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలి. నకిలీ వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి అని సూచించారు. వస్తు లేదా సేవలో లోపాలపై వినియోగదారులు రెండు సంవత్సరాల లోపు ఫిర్యాదు చేయవచ్చని, జాగృతి పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. జరిగిన నష్టానికి సంబంధించిన రసీదులు, వివరాలు సమర్పించి ఎంత నష్టపరిహారం కోరుతున్నారో స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. వినియోగదారుల కమిషన్ నుండి నోటీసు పంపిన 30 రోజుల్లోగా సంబంధిత సంస్థ సమాధానం ఇవ్వాలని, 50 లక్షల రూపాయల లోపు ఫిర్యాదులు జిల్లా పరిధిలో, రెండు కోట్ల రూపాయల లోపు రాష్ట్ర కమిషన్ పరిధిలో పరిష్కరించబడతాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, పౌరసరఫరాల సంస్థ డీఎం రజనీకాంత్, వినియోగదారుల ఫోరం నాయకులు, ఎన్జీవోలు పాల్గొన్నారు

## కార్మికులపై కక్షసాధింపు చర్యలు ఆపాలని డిమాండ్

**పెద్దపల్లి, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి కార్మిక అధికారిణి హేమలత తీరుపై భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కార్మికులకు న్యాయం చేయాల్సిన అధికారిణి వారిని వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ, దళిత బహుజన లేబర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లోని టంగుటూరి అంజయ్య కార్మిక సంక్షేమ భవనంలో తెలంగాణ రాష్ట్ర లేబర్ కమిషనర్ పమేలా సత్పతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి కైలాసం మాట్లాడుతూ, పెద్దపల్లి కార్మిక అధికారి హేమలత ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన ఆర్థిక సహాయాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన బెనిఫిట్ బిల్లులను వరుసగా తిరస్కరిస్తూ, అనవసరపు కొర్రీలతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. గతంలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా, మందలించినా సదరు అధికారిణి తీరులో మార్పు రాలేదని ఆయన పేర్కొన్నారు. మంథనిలో విధులు నిర్వహించిన సమయంలో కూడా కార్మికుల తరఫున మాట్లాడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సహా పలు తప్పుడు కేసులు నమోదు చేయించారని, దీనివల్ల కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయని వివరించారు. కార్మికుల హక్కులను కాలరాస్తున్న అధికారిణిని తక్షణమే బదిలీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ప్రయోజనాలను కార్మికులకు అందేలా చూడాలని కైలాసం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవత వెలుగు అవార్డు గ్రహీత దార మధు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభల్లో బాలల హక్కులపై అవగాహన కల్పించాలి

– కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, బాలల హక్కుల పరిరక్షణపై గ్రామ సభల్లో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి అని సూచించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోలీసులు, ఉపాధ్యాయులకు బాలల హక్కులపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సభల్లో బాలల హక్కులపై అవగాహన కల్పించడం అత్యవసరమని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు, అంగన్వాడి, ఆశా వర్కర్లు, గ్రామ కార్యదర్శులు, సర్పంచులకు బాల్య వివాహాలు, బాలల హక్కుల ఉల్లంఘన, బాల పరిరక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. బాధిత చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు, బాలసదనాల గురించి ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా బాలల హక్కుల పరిరక్షణ అధికారి పర్వీన్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సంపత్, సఖి కేంద్రం అడ్మిన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పోచమ్మ బోనంతో మొక్కులు చెల్లించుకున్న మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మండిగ రేణుక రాజ నరసయ్య


పోచమ్మ బోనాలలో పాల్గొన్న ఎలిగేడు సర్పంచ్ కప్పల ప్రవీణ్

# ప్రత్యేక వైద్య శిబిరానికి విశేష స్పందన




ప్రత్యేక వైద్య శిబిరంలో పాల్గొన్న స్పెషలిస్ట్ డాక్టర్లు

**ఎలిగేడు, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఎలిగేడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. స్పెషలిస్టు వైద్యులచే నిర్వహించిన ఈ శిబిరానికి ప్రజలు విశేషంగా స్పందించారు.మొత్తం 207 మంది పరీక్షలు చేయించుకున్నారు. అందులో గర్భిణీలు 35, జనరల్ మెడిసిన్ 54, చిన్నపిల్లలు 9, కంటి పరీక్షలు 40, దంత వైద్యం 21, ఆర్థోపెడిక్ 48 మంది పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.ఈ ప్రత్యేక వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీరాములు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా, హెచ్ఐవో రాజేశ్, సర్పంచులు కప్పల ప్రవీణ్, మారం కొమురయ్య, స్పెషలిస్టు వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అగ్రవర్ణ రాజ్యం నడుస్తోంది

-- రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్


గాయపడిన రజకుడు పరశురాం పరామర్శిస్తున్న రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్

**ఎలిగేడు, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
“రాష్ట్రంలో అగ్రవర్ణాల రాజ్యం కొనసాగుతోంది. రజకులపై దాడులు పెరుగుతున్నాయి. దాడి చేసిన వారిపై వెంటనే హత్యాయత్నం కేసు నమోదు చేయాలి” అని తెలంగాణ రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు పూసాల సంపత్ అన్నారు. బుధవారం ఎలిగేడు మండలంలోని బుర్హాన్మియాపేట గ్రామంలో అగ్రవర్ణ రెడ్డిల దాడిలో గాయపడిన చంద్రగిరి పరుశరాములను ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ, “నాగర్‌కర్నూల్ జిల్లా కొమ్మెర గ్రామ ఘటన మరువక ముందే పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలంలో పరుశరాములుపై దాడి జరగడం దుర్మార్గమైన చర్య. రాజకీయ కక్ష్యతో ఏడుగురు రెడ్డిలు ఇంటిపైకి వచ్చి దాడి చేయడం ఖండనీయం” అని అన్నారు. దాడి చేసిన వారిపై వెంటనే హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు వీరి అరెస్టును అడ్డుకోవద్దని కోరారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరగకుండా రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంగిపల్లి శంకర్, పొన్నం శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ చంద్రగిరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది 2026 పరాభవ

# నామ సంవత్సరానికి స్వాగతం






తెలుగు ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఉగాది పండుగ ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ పాడ్యమి రోజున జరుపుకుంటారు. ఇది తెలుగు సంవత్సరాది ప్రారంభాన్ని సూచించే పర్వదినం. 2026 మార్చి 19వ తేదీ గురువారం ఉగాది పండుగ జరగనుంది. ఈ సంవత్సరం పరాభవ నామ సంవత్సరంగా పిలుస్తారు. హిందూ పంచాంగంలోని అరవై సంవత్సరాల చక్రంలో ఇది 40వ సంవత్సరం. పరాభవం అనే పదానికి ఆధ్యాత్మికంగా అహంకారాన్ని జయించడం, అనుభవాల ద్వారా ఎదగడం, వినయంతో జీవించడం వంటి లోతైన అర్థాలు ఉన్నాయి. ఈ సంవత్సరం మనలో ఆత్మపరిశీలన, వినయం, ధర్మం పెంపొందించుకోవాలని సూచిస్తుంది. ఉగాది అనే పదం యుగాది నుంచి ఉద్భవించింది. యుగం అంటే కాలం, ఆది అంటే ప్రారంభం. అంటే కొత్త కాలానికి నాంది పలికే రోజు. పురాణాల ప్రకారం చైత్ర శుద్ధ పాడ్యమి రోజునే బ్రహ్మదేవుడు సృష్టిని ప్రారంభించాడని విశ్వాసం ఉంది. అలాగే వసంత ఋతువు ప్రారంభమయ్యే సమయం కూడా ఇదే కావడం వల్ల ప్రకృతి కొత్త కాంతిని సంతరించుకుంటుంది. అందుకే ఉగాది పండుగను కొత్త జీవనానికి సంకేతంగా భావిస్తారు. ఉగాది రోజున తెల్లవారుజామునే ప్రజలు లేచి ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేస్తారు. మామిడి ఆకులతో తోరణాలు కట్టి పండుగ వాతావరణాన్ని సృష్టిస్తారు. అనంతరం దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించి దేవుని ఆశీస్సులు పొందుతారు. ఈ పండుగలో అత్యంత ముఖ్యమైన అంశం ఉగాది పచ్చడి. ఇది కేవలం ఒక వంటకం మాత్రమే కాదు, మన జీవిత తాత్పర్యాన్ని తెలియజేసే గొప్ప సంకేతం. ఈ పచ్చడిలో ఆరు రుచులు ఉంటాయి -- చేదు, తీపి, పులుపు, కారం, వగరు, ఉప్పు. ఇవి మన జీవితంలో ఎదురయ్యే అనుభవాలను సూచిస్తాయి. వేపపువ్వు దుఃఖాన్ని, బెల్లం ఆనందాన్ని, చింతపండు ఆశ్చర్యాన్ని, మామిడి మార్పును, మిరపకారం కోపాన్ని, ఉప్పు సమతుల్యతను సూచిస్తాయి. జీవితం అనేది సుఖదుఃఖాల సమ్మేళనం అని ఈ పచ్చడి మనకు బోధిస్తుంది. ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం కూడా ఒక ముఖ్యమైన సంప్రదాయం. పండితులు కొత్త సంవత్సరానికి సంబంధించిన పంచాంగాన్ని చదివి వినిపిస్తారు. అందులో వర్షపాతం, వ్యవసాయం, గ్రహస్థితులు, శుభ ముహూర్తాలు వంటి విషయాలను ప్రజలకు తెలియజేస్తారు. దీని ద్వారా ప్రజలు తమ భవిష్యత్ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటారు. మొత్తానికి ఉగాది పండుగ కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు, ఒక కొత్త ఆరంభం. గతంలోని కష్టాలను మరచి, మంచి ఆలోచనలతో, సత్సంకల్పాలతో కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి ఇది ఒక గొప్ప అవకాశాన్ని ఇస్తుంది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి ఆనందాన్ని పంచుకునే శుభసందర్భం కూడా ఇదే.

### శుభ ఉగాది శుభాకాంక్షలు!

ఈ పరాభవ నామ సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం, శాంతి నిండాలని నీలగిరి ఎక్స్‌ప్రెస్ ఆకాంక్షిస్తోంది.

వ్యాసకర్త
వేల్పుల మహేందర్
ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంఎడ్



# గేటెడ్ కమ్యూనిటీల్లో అన్ని వసతులు కల్పించాలి -- కేఎల్ఆర్



**మహేశ్వరం, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గేటెడ్ కమ్యూనిటీల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించాల్సిన బాధ్యత బిల్డర్‌దేనని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తుక్కుగూడ డివిజన్‌లోని ఫ్యాబ్ సిటీ పరిధిలో విశాల్ సంజీవిని విల్లాస్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో సమావేశమై పలు సమస్యలను విన్నారు. క్లబ్ హౌస్ సహా ఇంటి యజమానులకు ఇచ్చిన అగ్రిమెంట్ ప్రకారం అన్ని పనులు, వసతులు కల్పించాలని బిల్డర్‌ను కోరారు. కాలనీవాసులతో కలిసి టిఫిన్ చేసిన కేఎల్ఆర్, విల్లాస్‌లో జరుగుతున్న పనులను అధికారులు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం




**మహబూబాబాద్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. సీనియర్ న్యాయవాది వై. చెన్నమల్లారెడ్డి మాట్లాడుతూ, “మాదకద్రవ్యాలు సమాజానికి చీడపురుగులు. విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలి. డ్రగ్స్ అలవాటు ఆరోగ్యాన్ని దెబ్బతీసి భవిష్యత్తును అంధకారమవుతుంది” అని హెచ్చరించారు. విద్యార్థులకు రాజ్యాంగ హక్కులు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. మహనీయుల జీవిత విశేషాలు, స్ఫూర్తిదాయక కథలు వివరించారు. అనంతరం న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన లఘు చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి. కిషన్ నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు ఉగాది

- ఆలయాల్లో పంచాంగ శ్రవణం
- పచ్చడి కుండలు, మామిడి కాయలు, కొమ్మలు కొనుగోలు చేస్తున్న మహిళలు





**ఆమనగల్లు, మార్చి 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని నేడు(గురువారం) ఆలయాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణం చేయనున్నారు. తెల్లవారు జాము నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రజలు ఇళ్లలో షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడిని సేవించిన అనంతరం కుటుంబ సమేతంగా సాయంకాలం ఆలయాలకు పంచాంగ శ్రవణంలో చేరుకుని పాల్గొంటారు. ఉగాది నేపథ్యంలో వేప పూవు, మామిడి కాయలు, కొమ్మలు, పచ్చడి కుండల కొనుగోళ్లతో బుధవారం పట్టణంలో సందడి వాతావరణం కనిపించింది.

# రంజాన్ ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు

**- మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్**



**ఆమనగల్లు, మార్చి 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు ప్రార్థనలు నిర్వహించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్ ఆదేశించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ఈద్గా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్మెన్ పత్యనాయక్ మాట్లాడుతూ.. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఈద్గా వద్ద అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈద్గా ప్రాంగణంలో శుభ్రత, తాగునీటి సదుపాయం, లైటింగ్, పారిశుధ్య ఏర్పాట్లు, పార్కింగ్ వంటి ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసం ముస్లింలకు ఆధ్యాత్మిక ప్రాముఖ్యం కలిగిందని పేర్కొంటూ వారు ప్రశాంతంగా ప్రార్థనలు నిర్వహించుకునేలా ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, ఖాదర్ ఖాద్రి, అబ్దుల్ ఖాదర్, అబ్దుల్ అలీమ్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, రహీం, రఫీ, గుండ్రాతి కుమార్ గౌడ్, నయుమ్ తదితరులు ఉన్నారు.

## రైతు భరోసాకు దరఖాస్తుల స్వీకరణ



**ఆమనగల్లు, మార్చి 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** యాసంగి సీజన్ రైతు భరోసా కోసం కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులంతా ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు ఫారం వెంట ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ ను జత చేసి మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతు వేదికల వద్ద ఏఈఓలకు అందించాలని సూచించారు.

## అందరూ సుఖసంతోషాలతో ఉండాలి



**ఆమనగల్లు, మార్చి 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆకాక్షించారు. ఆయన బుధవారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. మనకు కొత్త సంవత్సరంలో పండుగలు ఉగాది నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఉగాది పచ్చడిలా ప్రజల జీవితాల్లో షడ్రుచులు ఉండాలని, కొత్త సంవత్సరంలో అందరికి మంచి జరగాలని ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

## శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి




**ఆమనగల్లు, మార్చి 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల ప్రజలు, పోలీస్ అధికారులకు తెలుగు సంవత్సరాది ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఏక కాలంలో రెండు పండుగలు వస్తున్నందున కులమతాలు వేరైనా మనమందరం భారతీయులమన్న విషయం మరిచిపోవద్దన్నారు. ఒకరి మత సాంప్రదాయాలను మరొకరు గౌరవించినప్పుడే మత సామరస్యం నెలకొంటుందన్నారు. ఎలాంటి గొడవలకు తావులేకుండా, శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సూచించారు. పండుగల సందర్భంగా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# గుమ్మడవల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉగాది వేడుకలు



**కందుకూరు, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలోని ఎంపీ యూపీఎస్ గుమ్మడవల్లి పాఠశాలలో తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదినాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో ఉగాది పచ్చడిని తయారు చేసి అందరూ కలిసి ఆనందంగా సేవించారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచులు జీవనంలోని సుఖ--దుఃఖాలు, విజయ--పరాజయాలు వంటి అనుభవాలను ప్రతిబింబిస్తాయని ఉపాధ్యాయులు వివరించారు. పిల్లలు ఉత్సాహంగా పాల్గొనడం, చేతుల్లో పచ్చడి కప్పులతో ఆనందాన్ని పంచుకోవడం పాఠశాలలో ఉత్సవ వాతావరణాన్ని సృష్టించింది. విద్యార్థుల్లో సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంలో ఈ కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా నిలిచింది. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. ధర్మనాయక్ అధ్యక్షతన జరిగింది. ఉపాధ్యాయులు రాధిక, భరత్‌కుమార్, అహమ్మద్ బి, అశ్విని చురుకుగా పాల్గొన్నారు. అంగన్వాడీ టీచర్లు శ్రీకాంత్, జహంగీర్, ఆయాలు కూడా సహకరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ, "ఉగాది పండుగ మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక. పిల్లల్లో మంచి విలువలు, జీవన పాఠాలు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరం" అని పేర్కొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో నివాసం తప్పనిసరి

**-- గడువులోగా ఎంపిక పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు**



**రంగారెడ్డి, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, అర్హులైన పేదలకు అందించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో హౌసింగ్ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మిషన్ భగీరథ, విద్యుత్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "పూర్తయిన మరియు నిర్మాణ దశలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి, ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎల్2 లిస్ట్ నుండి అర్హులను గుర్తించి, జిల్లా మంత్రి ఆమోదంతో గజిటెడ్ అధికారుల ధృవీకరణ అనంతరం కేటాయింపులు చేయాలి" అని సూచించారు. కేటాయించిన ఇండ్లలో లబ్ధిదారులు తప్పనిసరిగా నివాసం ఉండాలని, ప్రస్తుతం నివసించని వారికి నోటీసులు జారీ చేసి మార్చి 31లోపు నివాసం ప్రారంభించాలని ఆదేశించారు. సమస్యలు ఉంటే వ్రాతపూర్వకంగా తెలియజేయాలని, లేనిపక్షంలో ఏప్రిల్ మొదటి వారంలో కేటాయింపులు రద్దు చేసి ఇతర అర్హులకు ఇవ్వనున్నట్లు హెచ్చరించారు. అన్ని హౌసింగ్ కాలనీలలో విద్యుత్, త్రాగునీరు, పరిశుభ్రత వంటి మౌలిక సదుపాయాలు తక్షణమే కల్పించాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. ఇంకా ఎల్2 లిస్ట్ మిగిలి ఉంటే, ఒక ఎకరానికి పైగా భూములను గుర్తించి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీలలో ఉన్న దుకాణాలను వేలం వేసి వచ్చిన నిధులను కాలనీల అభివృద్ధికి వినియోగించనున్నట్లు తెలిపారు. అధికారులు నిర్లక్ష్యం చేయకుండా సమన్వయంతో పని చేసి, నిర్దేశిత గడువులో లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె. శ్రీనివాస్, జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి. చాంప్లా నాయక్, ఆర్డీఓలు, తహసీల్దార్లు, హౌసింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఏటీసీ భవన నిర్మాణానికి కొండారెడ్డిపల్లిలో ప్రభుత్వ భూమి పరిశీలన



**వంగూర్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, వంగూర్ మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవన నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూమిని బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థల పరిమాణం, చేరుకునే మార్గాలు, మౌలిక వసతుల లభ్యత వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారుల నుండి రికార్డులు, యాజమాన్య వివరాలు, విస్తీర్ణం వంటి సమాచారాన్ని సేకరించారు. ఏటీసీ నిర్మాణానికి అనువైన ప్రదేశాన్ని ఖరారు చేయడంలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన మార్గదర్శకాలను తక్షణమే విడుదల చేయాలని వంగూర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. భూమి కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేసి, పరిపాలనా అనుమతులను త్వరగా పూర్తి చేయాలని, ఫైళ్లను ఆలస్యం చేయకుండా ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏటీసీ భవన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమయ్యేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని, నిధులు, సాంకేతిక సిబ్బంది, నిర్మాణ సంస్థల ఎంపిక వంటి అంశాలను సమయానుకూలంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ద్వారా ప్రాంతీయ యువతకు ఆధునిక సాంకేతిక శిక్షణ లభిస్తుందని, డిజిటల్--టెక్నికల్ రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. దీనివల్ల స్థానిక ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడుతుందని తెలిపారు. కలెక్టర్ వెంట కల్వకుర్తి ఏటీసీ ప్రిన్సిపల్, మండల తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు ఉగాది వేడుకలు



**మహబూబాబాద్, మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్థానిక ఎన్.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో తెలుగు నూతన సంవత్సరం శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాదిను పురస్కరించుకొని తెలుగు, హిందీ, ఆంగ్ల శాఖల ఆధ్వర్యంలో ముందస్తుగా ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ, "ఉగాదిని యుగాది అని కూడా అంటారు. ఈ నూతన సంవత్సరం మన జీవితంలో కొత్త మార్పులను తీసుకురావాలి" అని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. హెచ్. శ్రీనివాసులు మాట్లాడుతూ, "ఉగాది మన తెలుగు వారి నూతన సంవత్సరం. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పంచాంగ శ్రవణం ఈ పండుగ ప్రత్యేకత" అని వివరించారు. తెలుగు లెక్చరర్ డా. పి. ఉపేందర్ మాట్లాడుతూ, "చైత్ర శుద్ధ పాడ్యమి రోజున జరుపుకునే ఉగాది సమయంలో ప్రకృతి కొత్త చిగురులు, ఆకులతో శోభను సంతరించుకుంటుంది. ఉగాది పచ్చడిలోని షడ్రుచులు జీవితంలోని విభిన్న అనుభవాలకు ప్రతీకలు" అని అన్నారు. హిందీ విభాగాధిపతి ఏ. అన్నపూర్ణ మాట్లాడుతూ, "తెలుగు భాషా, సంస్కృతి విశిష్టమైనవి. వాటిని కాపాడుకోవడం మన అందరి బాధ్యత" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు తరగతి గదుల గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి, ముంగిల్లలో ముగ్గులు వేసి, ఉగాది పచ్చడి, ప్రత్యేక వంటకాలు సిద్ధం చేసి అధ్యాపకులు, విద్యార్థులకు రుచి చూపించారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ బి. శ్రీనివాస్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ జె. అనిల్, అధ్యాపకులు మసూద్ అహ్మద్, సాంబశివరావు, సుమన్, హతిరాం, కాశీం షా, సుమలత, రవితేజ, నరేష్, యం. వీరు, బోధనేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



**యాచారం , మార్చి 18 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, బీజేపీ నాయకులు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు .అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించి, నిరసనలు తెలిపారు.

ప్రభుత్వం ఏర్పాడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా నెరవేర్చలేదని యాచారం బిజెపి మండల అధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు, కార్యాకర్తలతో కలిసి తహశీల్దార్ కార్యాలయంలో . =× కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొప్పు బాషా , రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యాదర్శి మఱిపల్లి అంజయ్య యాదవ్ హాజరై మాట్లాడుతూ ... కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలైన రైతు భరోసా, పింఛన్లు, నిరుద్యోగ భృతి, దళిత బంధు, కళ్యాణ లక్ష్మి, మహిళలలకు భరోసా, డబల్ బెడఁరూం ఇండ్లు తదితర హామీలు ఇచ్చి ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో ఆమలు చేయలేదని చేతగాక పోతే వెంటనే గద్దె దిగాలని అన్నారు ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి కొండా మధుకర్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు నాగిని యాదయ్య, ఆంబోజి జగదీశ్ యాదవ్,గోగికర్ రమేష్,దెరంగుల రాజు, తాండ్ర రవీందర్, బిజెపి సర్పంచ్ లు ఆంబోజి రమేష్, బాలరాజు,రాయకంటి విజయ్ కుమార్, వీరితో పాటు ఉపసర్పంచ్ లు వార్డ్ మెంబెర్స్ అన్ని గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# పెరూ కొత్త ప్రధానిగా లూయిస్ ఎన్రిక్




**పెరూ :మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెరూ తాత్కాలిక అధ్యక్షుడు జోస్ మారియా బల్కాజర్.. మంగళవారం కొత్త ప్రధానిగా జనరల్ లూయిస్ ఎన్రిక్ అరోయోను నియమించారు. ప్రధానిగా ఉన్న డెనిస్ మిరాలెస్ మంగళవారం తన పదవికి రాజీనామా చేయడంతో అధ్యక్షుడు జోస్.. కొత్త ప్రధానిగా ఎన్రిక్‌ను నియమించారు. డెనిస్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మూడువారాలకే ఆమె రాజీనామా చేయడం గమనార్హం. ఆమె రాజీనామాతో అనూహ్యంగా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సంక్షోభంలో పడింది. కాగా, కొత్తగా ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అరియో.. మిరాలెస్ హయాంలో రక్షణ మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ విశ్వాస తీర్మానానికి ఒకరోజు ముందు డెనిస్ మిరాలెస్ రాజీనామా చేయడంతో.. అధ్యక్షుడు జోస్ మారియా నియమించిన మరో 18 మంది పెరూ కేబినెట్ సభ్యులు కూడా తమ పదవుల నుంచి వైదొలగాల్సి వచ్చింది. అయితే మిరాలెన్ తన రాజీనామా గల కారణాలను వెల్లడించలేదు. తన రాజీనామాను ఆమోదించాలని అభ్యర్థిస్తున్నట్టుగా అధ్యక్షుడికి రాసిన లేఖలో ఆమె పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి పారదర్శతగా జరిగేలా దృష్టి సారించడమే ప్రస్తుత ప్రభుత్వ ధ్యేయమని అధ్యక్షుని కారాల్యయం విడుదల చేసిన ప్రకటన తెలిపింది. పెరువియన్ చట్టం ప్రకారం.. అధ్యక్షుడిచే నియమించిన ప్రధాని, కేబినెట్ నాయకులు పదవి చేపట్టిన మొదటి నేలలోనే కాంగ్రెస్ విశ్వాస తీర్మానాన్ని పొందవలసి ఉంటుంది. ఒకవేళ ప్రధానిగా విశ్వాస ఓటులో నెగ్గకపోతే.. కేబినెట్ మంత్రులతో పాటు ప్రధాని కూడా రాజీనామా చేయాలి. అయితే ఇప్పుడు జరగబోయే విశ్వాస ఓటింగ్‌లో కచ్చితంగా మితవాద ప్రతిపక్షం గెలిచే అవకాశం ఉన్నందున మిరాలెన్ ఓటింగ్‌కు ముందే రాజీనామా చేసినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఇన్నాళ్లు ప్రధానిగా సేవలందించినందుకు డెనీస్ మిరాలెస్‌కి అధ్యక్ష భవనం కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు బల్కాజర్ కార్యాలయం సోషల్‌మీడియాలో విడుదల చేసిన ప్రకటన తెలిపింది.

# మొజ్తాబా ఖమేనీని వెతికిపట్టుకుని అంతం చేస్తాం



**న్యూఢిలీమార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇరాన్ నూతన సుప్రీం లీడర్ అయతుల్లా మొజ్తాబా ఖమేనీ ని ఎక్కడ ఉన్నా వెతికి పట్టుకుని అంతం చేస్తామని ఇజ్రాయెల్ గట్టి హెచ్చరిక చేసింది. తమ దేశానికి ముప్పుగా ఉన్నవాళ్లు ఎప్పుడూ తమ టార్గెట్‌లోనే ఉంటారని పేర్కొన్నది. అయితే ప్రస్తుతం ఖమేనీ ఎక్కడున్నారనే దానిపై తమవద్ద సమాచారం లేదని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పింది.మొజ్తాబా ఎక్కడున్నారన్న దానిపై మావద్ద ప్రస్తుతం సమాచారం లేదని, కానీ మా దేశానికి ముప్పుగా పరిణమించిన వారిని వెంబడించడం మాత్రం ఆపమని ఇరాన్ రక్షణ దళాల ప్రతినిధి ఎఫీ డెఫ్రిన్ అన్నారు. తమకు వ్యతిరేకంగా వ్యవహరించేవారు తమ నుంచి తప్పించుకోలేరని, వారిని తరిమి తరిమి అంతం చేస్తామని వ్యాఖ్యానించారు. ఎప్పుడు, ఎక్కడ అనేది ఇప్పుడే కచ్చితంగా చెప్పలేకపోయినా తమ టార్గెట్ మాత్రం మిస్ కాదని డెఫ్రిన్ వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే అమెరికా, ఇజ్రాయెల్ బలగాల దాడుల్లో గాయపడిన ఖమేనీని చికిత్స కోసం రష్యాకు తరలించినట్లు వచ్చిన వార్తలను ఇరాన్ ఖండించింది. ఇదొక కొత్తతరహా మానసిక యుద్ధమని, ఇరాన్ నేతలకు పారిపోవాల్సిన, దాక్కోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఇరాన్ అత్యున్నత సైనికాధికారి అలీ లారిజానీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ అనుబంధ బసీజ్ మిలీషియా అధిపతి జనరల్ గులాం రెజా సాల్మనీ ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందారని ఇరాన్ ధ్రువీకరించింది.

# గుజరాత్ అసెంబ్లీకి బాంబు బెదిరింపు..




**గాంధీనగర్: మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గుజరాత్ అసెంబ్లీ కి బుధవారం బాంబు బెదిరింపు వచ్చింది. ఈ మెయిల్ ద్వారా ఆ బెదిరింపు చేశారు. ప్రస్తుతం బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. అయితే బుదవారం సమావేశాలు ప్రారంభం కావడానికి ముందే ఈ మెయిల్ వచ్చినట్లు తెలిసింది. అంసెబ్లీ కాంప్లెక్స్‌లో బాంబును అమర్చినట్లు బెదిరింపులో పేర్కొన్నారు. దీంతో అసెంబ్లీ లో ఉన్న సిబ్బంది, ఎమ్మెల్యేలను పరిసర ప్రాంతం నుంచి ఖాళీ చేయించారు. డిప్యూటీ ఎస్పీ పీయూష్ వందా ఈ విషయాన్ని వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాలు ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సి ఉన్నది. కానీ ఉదయం 8.45 నిమిషాలకు బాంబు బెదిరింపు మెసేజ్ వచ్చిందన్నారు. బాంబు బెదిరింపు సమాచారం రావడంతో.. పోలీసులు అసెంబ్లీకి వచ్చి పేలుడు పదార్థాల కోసం సోదాలు మొదలుపెట్టారు. అయితే ఇప్పటి వరకు ఎటువంటి అనుమానిత వస్తువును గుర్తించలేదన్నారు.

# బెంగాల్‌లో 13మంది ఐఏఎస్‌ల బదిలీ




**కోల్‌కతా :మార్చి 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అసెంబ్లీ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లో ఎన్నికల సంఘం (ఇసి) బుధవారం 13 మంది ఐఎఎస్‌లను బదిలీ చేసింది. పలువురు జిల్లా మెజిస్ట్రేట్‌లు (డిఎం)లను నియమించడంతో పాటు, వారిని జిల్లా ఎన్నికల అధికారులుగా (డిఇఒ)కూడా నియమించి, ఎన్నికల పరిశీలకులుగా కీలక బాధ్యతలను అప్పగించాలని ఆదేశించింది. జితిన్‌యాదవ్ (కూచ్ బెహార్), సందీప్ ఘోష్ (జల్పాయి గరి), వివేక్ కుమార్ (ఉత్తర దినాజ్‌పూర్), రాజన్వీర్ సింగ్ కపూర్ (మాల్డా) మరియు ఆర్.అర్జున్ (ముర్షిదాబాద్) సహా పలువురు అధికారులను జిల్లా మెజిస్ట్రేట్ కమ్ డిస్ట్రిక్ పోల్ ఆఫీసర్స్‌గా నియమించినట్లు ఇసి తెలిపింది. స్మితా పాండే కోల్‌కతా మునిసిపల్ కార్పోరేషన్ కమిషనర్‌గా, కోల్‌కతా నార్త్ డిఇఒగా నియమితులవగా, రణధీర్ కుమార్ కోల్‌కతా సౌత్ డిఇఒగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు బదిలీ అయిన అధికారులను ఎన్నికలకు సంబంధించిన ఏ విధుల్లోనూ నియమించకూడదని ఇసి ఆదేశించింది.

# బిజినెస్

## రూపీ @92.89.. డాలర్ ముందు దేశీయ కరెన్సీ విలవిల

--ఆల్‌టైమ్ కనిష్ఠానికి మారకం విలువ
--ఒక్కరోజే 49 పైసలు పతనం


**ముంబై, మార్చి 18**
డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రోజుకో రికార్డు స్థాయికి దిగజారుతున్నది. బుధవారం ఫారెక్స్ మార్కెట్‌లో మరోమారు ఆల్‌టైమ్ కనిష్ఠానికి దేశీయ కరెన్సీ వ్యాల్యూ క్షీణించింది. ఈ ఒక్కరోజే 49 పైసలు పడిపోయి మునుపెన్నడూ లేనివిధంగా 92.89 వద్దకు పతనమైంది. ఉదయం ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్‌పై 92.42 దగ్గర మొదలైన రూపీ ట్రేడింగ్.. అంతకంతకూ బలహీనపడుతూ చివరకు 92.89 వద్ద ముగిసింది. మంగళవారం 92.40 దగ్గర స్థిరపడిన విషయం తెలిసిందే.

**ఇదీ సంగతి..**
అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఎగబాకుతున్న ముడి చమురు ధరలు, భారతీయ దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరుగుతున్న డిమాండ్, దేశీయ మార్కెట్ నుంచి తరలిపోతున్న విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్‌ఐఐ) పెట్టుబడులు.. రూపాయి ఉసురు తీస్తున్నాయని ఫారెక్స్ మార్కెట్ నిపుణులు చెప్తున్నారు. కాగా, నష్టపోతున్న రూపాయి మారకం విలువ.. భారత్‌లోకి దిగుమతయ్యే ప్రతి వస్తూత్పత్తి



ధరను మరింత పెంచుతుందని ఆర్థిక విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. ముఖ్యంగా దేశీయ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం విదేశాల నుంచి వచ్చే దిగుమతుల ద్వారానే తీరుతున్న నేపథ్యంలో రూపాయి క్షీణత.. యావత్తు దేశ ఆర్థిక వ్యవస్థనే ప్రమాదంలో పడేస్తున్నదని హెచ్చరిస్తున్నారు. మరిన్ని డాలర్లను చెల్లించి కావాల్సినవి కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడుతున్నదని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ద్రవ్యోల్బణం ఇంకా పెచ్చుమీరుతుందని అంటున్నారు. అదే జరిగితే జీడీపీ వృద్ధిరేటు, ఉద్యోగావకాశాలు, తయారీ, వినిమయ సామర్థ్యం, కొనుగోలు శక్తి, రుణ లభ్యత.. అన్నీ ప్రభావితమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మూడోరోజూ లాభాల్లో సూచీలు.. సెన్సెక్స్ 633, నిఫ్టీ 196 పాయింట్లు వృద్ధి



**ముంబై, మార్చి 18 :**
దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాలతో కళకళలాడుతున్నాయి. పశ్చిమాసియాలో రోజురోజుకూ ఉద్రిక్త పరిస్థితులు పెరుగుతున్నప్పటికీ మదుపరులు మాత్రం కొనుగోలుకు మొగ్గుచూపారు. ఫలితంగా వరుసగా మూడోరోజూ బుధవారం కూడా సూచీలు ఒక్క శాతం వరకు బలపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు తగ్గుముఖం పట్టడం, గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు ర్యాలీకి తోడయ్యాయి. ఒక దశలో వెయ్యి పాయింట్ల వరకు లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 633.29 పాయింట్లు అందుకొని 76,704.13 వద్ద స్థిరపడింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 196.65 పాయింట్లు ఎగబాకి 23,777.80 పాయింట్లకు చేరుకున్నది.

**9 లక్షల కోట్లు పెరిగిన సంపద**
స్టాక్ మార్కెట్లు వరుస లాభాలతో మదుపరులు సంపద అమాంతం పెరిగింది. వరుసగా మూడు రోజుల్లో వీరి సంపద రూ.9 లక్షల కోట్లకు పైగా ఎగబాకింది. గత మూడు సెషన్లలో బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 2,140.21 పాయింట్లు లేదా 2.87 శాతం బలపడింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.9,18,579.57 కోట్లు బలపడి రూ.4,39,00,831 కోట్ల(4.75 ట్రిలియన్ డాలర్ల)కు చేరుకున్నది.

## ఆడీ క్యూ8 మాడల్.. ప్రారంభ ధర రూ.1.77 కోట్లు


**ముంబై,**
జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడీ..దేశీయ మార్కెట్లోకి మరో లగ్జరీ మాడల్‌ను తీసుకొచ్చింది. ఎస్‌యూవీ పరిధిని మరింత విస్తరించాలనే ఉద్దేశంతో నయా క్యూ8 మాడల్‌ను ప్రవేశపెట్టింది. ఈ కారు ప్రారంభ ధర రూ.1,77,72,000. ఈ ధరలు ముంబై షోరూంనకు సంబంధించినవి. శక్తివంతమైన 4.0 లీటర్ వీ8 టీఎఫ్ఎస్ఐ ఇంజిన్‌తో తయారైన ఈ కారు కేవలం 4.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది.గంటకు 250 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నది. హెచ్‌డీ మ్యాట్రిక్స్ ఎల్ఈడీ హెడ్‌లైట్స్, పానోరమిక్ సన్‌రూఫ్, స్పోర్ట్ సీట్స్, వైర్‌లెస్ చార్జింగ్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది. ఈ కారుపై పదేండ్ల రోడ్‌సైడ్ అసిస్టెన్స్ వ్యారెంటీని కల్పిస్తున్నది.




# స్పోర్ట్స్

## సన్ రైజర్స్ కొత్త కెప్టెన్‌గా ఇషాన్ కిషన్

హైదరాబాద్
నిరుడు దేశవాళీల్లో సత్తాచాటి టీ20 ప్రపంచకప్‌లో అనూహ్యంగా జట్టులోకి వచ్చి భారత్‌కు మూడో కప్పును అందించడంలో కీలకపాత్ర పోషించిన ఇషాన్ కిషన్‌కు మరో బంపరాఫర్ దక్కిం ది. రాబోయే ఐపీఎల్ సీజన్‌లో అతడు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. వెన్నుగాయం కారణం గా ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోని రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్.. కొన్ని మ్యాచ్‌లకు దూరం కానున్న తరుణంలో సన్‌రైజర్స్ తాత్కాలిక సారథిగా ఇషాన్‌ను నియమించింది.అతడికి డిప్యూటీగా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మను వైస్ కెప్టెన్‌గా ప్రకటించింది. కమిన్స్ ఎన్ని మ్యాచ్‌లకు దూరమవుతాడనే దానిపై స్పష్టత లేకపోయినప్పటికీ అతడు ఈనెల 23న ఫ్రాంచైజీతో కలుస్తాడని జట్టు వర్గాల సమాచారం. ఇక్కడే అతడి పునరావాసం కొనసాగనున్నట్టు తెలుస్తున్నది. ఎస్ఆర్‌హెచ్




ఈనెల 28న బెంగళూరులో డిఫెండింగ్ టైటిల్ వేటను మొదలుపెట్టనున్న విషయం చాంపియన్స్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో ఐపీఎల్-19 ప్రారంభ మ్యాచ్‌తో తెలిసిందే.

## సన్‌రైజర్స్ మార్చి 22న ఈవెంట్ కోసం ఫ్రీ టిక్కెట్లు




ఐపీఎల్ 2026 సీజన్ ఉత్సాహంలో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ ఆరెంజ్ ఆర్మీ అభిమానులకు ఒక అద్భుతమైన అవకాశం కల్పిస్తోంది. సన్‌రైజర్స్ తారలను అత్యంత దగ్గరగా కలుసుకునేందుకు 'మీట్ ద రైజర్స్' పేరుతో ఒక ప్రత్యేకమైన ఈవెంట్‌ను నిర్వాహకులు ప్లాన్ చేశారు. ఈ భారీ కార్యక్రమం మార్చి 22న హైదరాబాద్ నగరంలో అట్టహాసంగా జరగనుంది. ఈ విషయాన్ని టీమ్ మేనేజ్మెంట్ అధికారిక సోషల్ మీడియా పేజీ ద్వారా వెల్లడించారు. ఎప్పుడూ టీవీల్లో లేదా స్టేడియం స్టాండ్స్‌లో చూసే తమ అభిమాన ఆటగాళ్లతో ముఖాముఖి మాట్లాడేందుకు ఈ మీట్ అండ్ గ్రీట్ ఈవెంట్ ఒక అరుదైన వేదికగా నిలవనుంది. ఈ కార్యక్రమానికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నప్పటికీ, కేవలం 1000 మంది అదృష్టవంతులైన అభిమానులకు మాత్రమే ఇందులో పాల్గొనే అద్భుత అవకాశం దక్కుతుంది. ముందుగా రిజిస్టర్ చేసుకున్న మొదటి వెయ్యి మందికి ఈ ఉచిత పాస్‌లు లభిస్తాయి. ఆరెంజ్ ఆర్మీ ఫ్యాన్స్ అంతా ఈ అద్భుత క్షణాల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సన్‌రైజర్స్ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో రేపు ఉదయం పోస్ట్ చేసే ప్రత్యేక లింక్‌పై క్లిక్ చేసి, యాప్‌లో సూచించిన విధంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి. ఇక్కడ గమనించాల్సిన అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఒక్కో వ్యక్తికి కేవలం ఒక టికెట్ మాత్రమే కేటాయిస్తారు. పరిమిత సంఖ్యలో పాస్‌లు అందుబాటులో ఉన్నందున, బుకింగ్ ఓపెన్ అయిన వెంటనే త్వరపడి టికెట్‌ను దక్కించుకోవాలి. మార్చి 22న జరగనున్న ఈ కార్యక్రమం అభిమానులు, ఆటగాళ్ల మధ్య బంధాన్ని మరింత దృఢం చేయనుంది. సన్‌రైజర్స్ ఆటగాళ్లతో సరదాగా ముచ్చటించడం, వారితో సెల్ఫీలు దిగడం, పంచుకున్న మధురమైన జ్ఞాపకాలను పదిలపరుచుకునేందుకు ఫ్యాన్స్‌కు ఇదొక అద్భుత వేదిక. రాబోయే ఐపీఎల్ సీజన్ కోసం ఆరెంజ్ ఆర్మీకి మరింత జోష్ నింపేలా ఫ్రాంచైజీ ఈ ఈవెంట్‌ను భారీ స్థాయిలో ప్లాన్ చేస్తోంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈవెంట్ జరగబోయే కచ్చితమైన వేదిక వివరాలను నిర్వాహకులు బహిర్గతం చేయలేదు. టికెట్ కన్ఫర్మ్ అయిన అభిమానులకు మాత్రమే వేదిక వివరాలను నేరుగా తెలియజేస్తారు. ఇంకెందుకు ఆలస్యం.. వెంటనే డిస్ట్రిక్ట్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని రేపు ఉదయం 11:30 గంటలకు మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి.

## చదువును నిర్లక్ష్యం చేయొద్దు

జీవితాంతం క్రీడల్లో కొనసాగలేం : పీవీ సింధు

**గురుగ్రామ్**
: ఆటల మీద ఆసక్తి ఉండి దానినే కెరీర్‌గా ఎంచుకున్నప్పటికీ చదువును మాత్రం నిర్లక్ష్యం చేయొద్దని డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు తెలిపింది. క్రీడల్లో ఒక్క గాయంతో కెరీర్‌లు కోల్పోతాయని, కానీ చదువు మాత్రం నిత్యం మనతోనే ఉంటుందని చెప్పింది. గురుగ్రామ్‌లోని ఓ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆమె ఈ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. సింధు మాట్లాడుతూ.. 'నేను చాలాకాలంగా బ్యాడ్మింటన్ ఆడుతున్నాను. ఏదో ఒక సమయంలో మనం (క్రీడాకారులు) రిటైర్ అవ్వాల్సిందే. అది ఎవరూ కాదనలేని వాస్తవం.45, 50 ఏండ్లు వచ్చాక అత్యున్నత స్థాయిలో ఆడటం చాలా కష్టం. ఎవ్వరైనా దానిని అంగీకరించాల్సిందే. కానీ చదువు



అలా కాదు. జీవితాంతం అది మనతోనే మనకు తోడుగా ఉంటుంది. క్రీడలతో పాటు విద్యాభ్యాసమూ ముఖ్యమే. నేను ఆటను కొనసాగిస్తూనే ఎంబీఏ పూర్తిచేశా. ఉదయం ట్రైనింగ్, మధ్యాహ్నం చదువు, మళ్లీ సాయంత్రం ట్రైనింగ్.. ఇది కష్టంతో కూడుకున్నదే అయినా చదువును నిర్లక్ష్యం చేయలేదు. జీవితంలో క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవడం మంచి విషయమే. కానీ చదువును ఆపొద్దు. ఎందుకంటే క్రీడల్లో ఒకసారి పెద్ద గాయమైతే మన కెరీర్ ముగిసినట్టే!' అని తెలిపింది.